సోమవారం
09-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 109
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తక్షణమే యుద్ధాన్ని ఆపేయాలి

ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ

ఇజ్రాయిల్, హమాస్ దళాల మధ్య యుద్ధం రావడానికి పూర్తి బాధ్యతను నెతన్యాహు ఫాసిస్టు ప్రభుత్వమే తీసుకోవాల్సి ఉంటుందని ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ (ఎంపకేవి) పేర్కొంది. ఉద్రిక్తత తీవ్రతరం కావడంపై ఆందోళన వ్యక్తంచేసింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం అనుసరిస్తున్న నేరపూరిత విధానాలతోనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టింది. ప్రాదేశిక శాంతికి భారీ ముప్పు సంభవించినట్లు పేర్కొంది.

2 లో

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై 20 నెలలు కావస్తోంది. ఆ యుద్ధం అంతం కాకముందే ఇజ్రాయిల్‌కు, పలస్తీనియన్లకు మరో యుద్ధం మొదలైంది. శనివారం పలస్తీనాలోని హమాస్ సంస్థ ఇజ్రాయిల్ మీద రాకెట్ల దాడి ప్రారంభించింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ హమాస్ మీద యుద్ధమే ప్రకటించింది. హమాస్ తీవ్రవాదులందరినీ రూపు మాపే దాకా యుద్ధం కొనసాగిస్తామని ఇజ్రాయిల్ ప్రతినబూనింది. హమాస్ కార్యకర్తలందరినీ వేటాడి హతమారుస్తామని ఇజ్రాయిల్ అంటోంది. నిన్న మొదలైన హింసాకాండలో ఎంతమంది మరణించారో అంచనాలు లేవు. ఇజ్రాయిల్ ఆదివారం దాడి మొదలెట్టిన తరవాత రెండు వైపులా కనీసం వెయ్యి మంది మరణించి ఉంటారు. హమాస్ కార్యకర్తలు ఇజ్రాయిల్ దక్షిణ ప్రాంతంలోకి ప్రవేశించారు. అనేకమంది ఇజ్రాయిలీ పౌరులను, సైనికులను బందీలుగా పట్టుకున్నామని హమాస్ చెప్తోంది. మోదీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించింది. అమెరికాతో పాటు పశ్చిమ దేశాల అండ ఎటూ ఉండనే ఉంది. అమెరికాను సమర్థించే ఈజిప్టు మద్దతూ ఇజ్రాయిల్‌కు ఉన్నట్టే. అయితే యుద్ధం విరమింప చేసే ప్రయత్నాలను ఈజిప్టు చేస్తోంది. కానీ రెండు పక్షాలు ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నాయి. ఏం జరిగినా పోరాటం ఆపేది లేదని హమాస్ అంటోంది. ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ ఇజ్రాయిల్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలవల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ గాజా పట్టణం మీద చేసిన దాడిలో అపారమైన నష్టం కలిగింది. ఇజ్రాయిల్ మీద పలస్తీనియన్లు ఇంత పెద్ద ఎత్తున దాడి చేయడం ఇదే మొదటి సారి. ఐక్యరాజ్య సమితి ప్రమేయంతో పలస్తీనా రాజ్యం అవతరించినప్పటికీ ఇజ్రాయిల్ ఎడాపెడా నిరంతరం బీభత్సం సృష్టిస్తూనే ఉంది.

ఇక యుద్ధమే

ఇజ్రాయిల్‌కు భారత్ సంఘీభావం

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్‌పై హమాస్ దాడులను భారత ప్రధాని మోదీ ఖండించారు. ఇజ్రాయిల్‌కు సంఘీభావం ప్రకటించారు. ఇజ్రాయిల్‌లో ఉగ్రదాడి జరగడం దిగ్ర్భాంతికి గురయ్యా. అమాయకులు, వారి కుటుంబాల కోసమే మా ప్రార్థనలు, ఆలోచనలు. ఈ విపత్కర సమయంలో ఇజ్రాయిల్‌కు తోడుగా నిలుస్తాం' అని మోదీ ఎక్స్ మాధ్యమంగా పేర్కొన్నారు. అయితే దీనిపై కేంద్రప్రభుత్వం తరపున అధికారిక ప్రకటన ఏమీ వెలువడలేదు. ప్రధాని తన ట్వీట్‌లో హమాస్ తీవ్రవాద సంఘాన్ని నిందించలేదు. అమాయకులు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్ర్భాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సంఘీభావం తెలిపారు. ఇజ్రాయిల్ విపత్కర పరిస్థితుల్లో ఉందని పేర్కొన్నారు. గతంలో పలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య ప్రతిష్టంభనలకు సంబంధించి స్పందనల దృష్ట్యా చాలా జాగ్రత్తగా మోదీ ట్వీట్ చేశారు.

- ఇజ్రాయిల్ స్థావరాలపై హెజ్బుల్లా దాడులు
- ఆరు వందల మందికిపైగా మృతి
- మన వాళ్లంతా క్షేమం: భారత ప్రభుత్వం ప్రకటన

టెల్ అవీవ్: ఇజ్రాయిల్ మీద పలస్తీనాలోని హమాస్ సంస్థ శనివారం వేలాది రాకెట్లు ప్రయోగించిన తరవాత హమాస్ ను తుడిచిపెట్టడానికి ఇజ్రాయిల్ సిద్ధమైంది. శనివారం హమాస్ కార్యకర్తలు ఇజ్రాయిల్ దక్షిణ భాగంలోని కొన్ని ప్రాంతాలలోకి ప్రవేశించారు. వారి మీద ఇజ్రాయిల్ దాడికి దిగింది. హమాస్‌ను సర్వ నాశనం చేసే దాకా వదిలిపెట్టేది లేదని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ భీకర ప్రకటనలు చేస్తున్నారు. ఇజ్రాయిల్

- మిగతా 2 లో

వెన్నంటే ఉంటాం

ఇజ్రాయిల్‌కు బైడెన్ మద్దతు

వాషింగ్టన్: ఇజ్రాయిల్‌పై హమాస్ దాడులను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీవ్రంగా ఖండించారు. ఎల్లప్పుడు అండగా నిలుస్తామని ఇజ్రాయిల్‌కు భరోసానిచ్చారు. ఈ దాడులను తిప్పికొట్టేందుకు అమెరికా మద్దతిస్తుందన్నారు. అదే సమయంలో ఇజ్రాయిల్ శత్రుదేశాలకు ఓ హెచ్చరిక చేశారు. ఈ పరిస్థితిని అదునుగా చేసుకోవద్దని, ప్రయోజనం పొందాలని చూడ వద్దని స్పష్టంచేశారు. 'ఇజ్రాయిల్‌పై దాడులు విషాదకరం. ఆదేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మాట్లాడా. ఉగ్రదాడిని ఖండించా. అమెరికా అండగా ఉంటుందని హామీ ఇచ్చా'అని బైడెన్ తెలిపారు. ఆత్మరక్షణ చర్యలు తీసుకోనే హక్కు ఇజ్రాయిల్‌కు ఉందని చెప్పారు. తన హయాంలో ఇజ్రాయిల్‌కు అమెరికా నుంచి అచంచలమైన మద్దతు ఉంటుందని, అక్కడి ప్రజలకు సాయం అందుతుందని బైడెన్ అన్నారు. హమాస్ దాడులను ప్రతిఘటించడంలో వెన్నంటే ఉంటామన్నారు. ఈ పరిస్థితి ద్వారా లాభం పొందే ప్రయత్నాన్ని ఎవరూ చేయొద్దని బైడెన్ హెచ్చరించారు.

కృష్ణా జలాల పునఃపంపిణీని వ్యతిరేకిస్తూ

18న కడపలో సీపీఐ సదస్సు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న కృష్ణా జలాల పున: పంపిణీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 18వ తేదీన కడపలో సీపీఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో వివాదాస్పద కుట్రకు తెరతీసిందన్నారు. కృష్ణా జలాల పునఃపంపిణీ పేరుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నష్టం కలిగించే ప్రక్రియ ప్రారంభించిందని తెలిపారు. కేవలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన కృష్ణ నీటిని మాత్రమే పునః పంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. అంతర్ రాష్ట్ర నదీ వివాదాల చట్టం-1956 ప్రకారం కృష్ణానది నీటి వివాదాలపై బచావత్ ట్రిబ్యునల్ ఏర్పాటయిందన్నారు. 75శాతం నీటి లభ్యత ఆధారంగా మొత్తం కృష్ణా నీటిని 2130 టీఎంసీలుగా లెక్కగట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు, మహారాష్ట్రకు 525 టీఎంసీలు, కర్నాటకకు 734 టీఎంసీలు కేటాయిస్తూ మిగులు జలాలను వాడుకునే వెసులుబాటును దిగువ

- మిగతా 2 లో

నేడు చంద్రబాబు

కీలక కేసుల విచారణ

- సుప్రీంలో స్కిల్ క్వాష్ పిటిషన్ వాదనలు
- హైకోర్టులో ముందస్తు బెయిళ్లపై తీర్పులు
- ఏసీబీ కోర్టులో కస్టడీ, మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ (ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ) కుంభకోణం కేసులో అవినీతి ఆరోపణ ఎదుర్కొంటున్న చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీం కోర్టులో సోమవారం మరోసారి వాదనలు కొనసాగున్నాయి. ఈ కీలక తీర్పు ఆధారంగా చంద్రబాబుపై నమోదయిన వివిధ కేసులు ముడిపడి ఉన్నాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ, అరెస్టయిన చంద్రబాబు 29 రోజులుగా రాజమండ్రి సెంట్రల్ జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. అప్పటీ నుంచి ఆయనపై సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను, రిమాండ్ రిపోర్టును రద్దు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ చంద్రబాబుకు తీర్పు వ్యతిరేకంగా రావడంతో మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో సుప్రీం తీర్పు పైనే టీడీపీ శ్రేణులు ఆశలు పెట్టుకున్నారు. అటు హైకోర్టులోను చంద్రబాబుపై నమోదయిన వివిధ కేసులపై ముందస్తు బెయిళ్లను దాఖలు

- మిగతా 2 లో

గేర్ మార్చిన జగన్!

- ఎన్నికలకు సన్నద్ధం
- మండల కేడర్‌పై దృష్టి
- ఎమ్మెల్యేల అసంతృప్తులే కారణమా ?
- నేడు 8,222 మంది ప్రతినిధులతో సమావేశం
- దిశా నిర్దేశం చేయనున్న సీఎం
- 'వై ఏపీ నీడ్స్ టు జగన్' ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అకస్మాత్తుగా గేర్ మార్చారు. రాబోయే ఆరు నెలల్లో ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల స్థాయిలో పార్టీ నాయకత్వానికి దిశా నిర్దేశం చేసేందుకు సన్నద్ధులయ్యారు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం వేదికగా సోమవారం భారీ సమావేశం జరగనుంది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా మండల, పట్టణాలకు చెందిన 8,222 మంది ద్వితీయ శ్రేణి నాయకులను ఆహ్వానిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వై నాట్ 175/175 నినాదంతో వైసీపీ ముందుకు పోతోంది.

ఈ సమావేశానికి సీఎం జగన్ విచ్చేసి పార్టీ శ్రేణులకు సందేశం ఇస్తారు. రాబోయే ఎన్నికల్లో ముందుకెలా వెళ్లాలి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా ఎలా తీసుకెళ్లాలని, అలాగే ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలను ఎలా తిప్పికొట్టాలనే దిశగా అవగాహన కల్పిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ప్రతినిధుల సమావేశంతోనే ఎన్నికల ప్రచారానికి జగన్ శ్రీకారం చుట్టేలా సంకేతం ఇవ్వనున్నారు. ఇందులో భాగంగానే వై ఏపీ నీడ్స్ టు జగన్? కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నారు.

ఎమ్మెల్యేలపై నమ్మకం సన్నగిల్లిందా?

ప్లాన్-ఏ లో భాగంగా ఒకవైపు ఎమ్మెల్యేలకు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు సీఎం జగన్ దిశా నిర్దేశం చేస్తున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సుదీర్ఘంగా నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయా?, లేదా? అనే దానిపై ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు ఆరా తీసేందుకు గాను

- మిగతా 2 లో

ఇదీ లోకం!



సర్టిఫికెట్ల జాప్యానికి కారకులెవరు?

- ఇంటర్ బోర్డు తీరుపై గందరగోళం
- ఐదు నెలల తర్వాత ముద్రణ
- సీఎంకు ఫిర్యాదుల వెల్లువ
- ఆర్ఐవో కార్యాలయాలకు పత్రాలు
- 12 తర్వాతే పంపిణీకి అవకాశం
- ఆలస్యంతో విద్యార్థుల ప్రవేశాలకు ఆటంకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల పంపిణీలో తీవ్ర జాప్యానికి గల కారణాలు అంతు చిక్కడంలేదు. అటు టెండర్ల ఆలస్యంగాను, ఇటు ఆర్థిక సమస్యలతోనే జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు చేతికి రానందున ఆయా కళాశాల్లోని కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు నానా పాట్లు పడుతున్నారు. ఈ వ్యవహారంలో ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు ఎప్పుడు వస్తాయో తెలియక ఐదు నెలల నుంచి కళాశాల చుట్టూ తల్లిదండ్రులు ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేయడంతో ఎట్టకేలకు బోర్డు ఆలస్యంగా మేల్కొంది. ఈ నెల 10న ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తామంటూ వెల్లడించింది. ఈ సమాచారం విద్యార్థులు తల్లిదండ్రుల కొంత ఊరట నిచ్చిప్పటికీ. ఆ జాప్యం వల్ల నష్టపోయిన విద్యార్థులకు ఎవరు న్యాయం చేస్తారంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్మీడియట్-2023 ప్రథమ, ద్వితీయ సంవత్సర రెగ్యులర్, ఇన్‌స్టెంట్ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలంటూ

- మిగతా 2 లో

శిథిలమైన అఫ్గాన్

- 2 వేలు దాటిన భూకంప మృతులు
- తొమ్మిది వేల మందికి గాయాలు
- 12 గ్రామాలు ధ్వంసం
- రెండు దశాబ్దాల్లోనే తీవ్రమైన భూకంపం

హెరాత్: అఫ్గానిస్తాన్ శిథిలమైంది. వరుసగా ఐదు భూకంపాలు సంభవించడంతో ఆదివారానికి మృతుల సంఖ్య రెండు వేలను దాటింది. మరో తొమ్మిది వేల మందికిపైగా గాయపడ్డారు. ఆరు గ్రామాలు పూర్తిగా ధ్వంసం కాగా మరో ఆరు గ్రామాల్లో నష్టం పాక్షికంగా ఉన్నట్లు తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. రెండు దశాబ్దాల్లోనే తీవ్రమైన భూకంపం శనివారం సంభవించినట్లు వెల్లడించారు. మృతుల సంఖ్య 2,060కు పెరుగగా గాయపడిన వారి సంఖ్య 9,240గా ఉన్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. 1,329 ఇళ్లు ధ్వంసమైనట్లు, 12 గ్రామాలు

- మిగతా 2 లో

పార్టీ పటిష్టతకు ప్రజాఉద్యమాలే శరణ్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ బలమైన ప్రజల పార్టీగా ఎదటానికి ప్రజా ఉద్యమాలే శరణ్యం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో తూము కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ భారతీయ జనతా పార్టీ అనే పదాన్ని మర్చిపోయి మోదీ..మోదీ..మోదీ..అనే పదాన్ని వల్లెవేస్తూ వ్యక్తి నియంతృత్వ పార్టీగా రూపాంతరం చెందిందన్నారు. మోదీ సంక్షేమ పథకాలు ఒక బటన్ నొక్కితే అంబానీకి, మరో బటన్ నొక్కితే అదానికి నిధులు మళ్ళుతున్నాయని విమర్శించారు. ఒక గుజరాతీయుడు మనకు స్వాతంత్ర్య సాధించిపెడితే మరో గుజరాతీయుడు దేశాన్ని అమ్మేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. కార్పొరేట్లకు భారతదేశ సార్వభౌమత్వాన్ని అంగట్లో సరుకు మాదిరిగా తూకంలో పెట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు మోదీ భజన చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కళ్లు తెరచి సెక్యులరిజం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్‌రెడ్డి రాక్షస పాలన నిరాటంకంగా సాగుతోందన్నారు. ప్రజాస్వామ్య హక్కుల్ని, మానవ హక్కుల్ని కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రశ్నించే గొంతుకల్ని అణిచివేయటంలో జగన్ సిద్ధహస్తుడన్నారు. ఢిల్లీ పర్యటనలో ఏమి సాధించారని సూటిగా

శంకర్

బుడ్డి రమేశ్

ప్రశ్నించారు. పోలవరానికి నిధులు, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్యాకేజీ, ప్రత్యేక హోదా ఏమి సాధించారని, ఢిల్లీ పర్యటన ఉద్దేశ్యం ఏమిటి? అని నిలదీశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో వ్యవసాయ కార్మికులను, రైతాంగాన్ని సమీకరించుకుని ఉద్యమించాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలు జరుగుతున్నాయన్నారు. రైతు కూలీలకు సక్రమంగా ఉపాధి హామీ పనులు లబ్ధి ఒనగూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు అకాశనంటుతున్నాయని చెప్పారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగటంతో సామాన్యుడు జీవించలేని పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ప్రజాసమస్యలపై ఉద్యమించటానికి కమ్యూనిస్టు పార్టీ సిద్ధం కావాలన్నారు.

ఇప్పటి వరకు సీపీఐ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన సీహెచ్.కోటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షునిగా ఎన్నికైనందున జిల్లా కార్యదర్శి బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. ఇప్పటి వరకు జిల్లా డిప్యూటీ సెక్రటరీగా ఉన్న దోనేపూడి శంకర్ జిల్లా కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా బుడ్డి రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరువూరు పట్టణ సీపీఐ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.ఉదయ్‌ను జిల్లా సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దోనేపూడి శంకర్‌ను రామకృష్ణ, జల్లి విల్సన్, అక్కినేని వనజ, సీహెచ్.కోటేశ్వరరావు, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా సమితి నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

తక్షణమే యుద్ధాన్ని ఆపేయాలి

- ఉద్రిక్తతలకు నెతన్యాహు ఫాసిస్టు ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత
- పలస్తీనాపై ప్రతికార దాడుల పర్యవసానమే ఘర్షణలు
- ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ

టెల్ అవీవ్: ఇజ్రాయిల్, హమాస్ దళాల మధ్య యుద్ధం రావడానికి పూర్తి బాధ్యతను నెతన్యాహు ఫాసిస్టు ప్రభుత్వమే తీసుకోవాల్సి ఉంటుందని ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ (ఎంఏకేఐ) పేర్కొంది. ఉద్రిక్తత తీవ్రతరం కావడంపై ఆందోళన వ్యక్తంచేసింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం అనుసరిస్తున్న నేరపూరిత విధానాలతోనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని దుయ్యబట్టింది. ప్రాదేశిక శాంతికి భారీ ముప్పు సంభవించినట్లు పేర్కొంది. దురాక్రమణను కొనసాగించేందుకు నెతన్యాహు ప్రభుత్వం అనుసరిస్తున్న పరిస్థితులతో వచ్చిన యుద్ధాన్ని తక్షణమే ఆపాలని తెలిపింది. అమాయక ప్రజలకు జరిగే హానిని ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లోనూ ముక్తకంఠంతో ఖండిస్తున్నట్లు తెలిపింది. పౌరులను రక్తపాతానికి దూరంగా ఉంచాలని పిలుపునిచ్చింది. బాధిత అరబ్‌లు, యూదుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. కొన్ని గంటల వ్యవధిలో అనేకమంది అమాయక పౌరుల ప్రాణనష్టానికి దారితీసిన అత్యంత ప్రమాదకర పరిస్థితులు దాపురించేందుకు ఫాసిస్టు మితవాద ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ప్రకటనలో తేల్చిచెప్పింది. ఎంతటి ప్రమాదకర మార్గంలో దేశాన్ని నెతన్యాహు ప్రభుత్వం నడిపిస్తోందన్న దానికి తాజా పరిణామాలు అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానించింది. పలస్తీనా ప్రజల న్యాయమైన హక్కులు, డిమాండ్లను గుర్తించడమే ఇందుకు ఏకైక పరిష్కారమని కమ్యూనిస్టు పార్టీ నొక్కిచెప్పింది. దేశంలోని అరబ్‌లు, యూదుల ప్రయోజనాల దృష్ట్యా చర్యలు ఉన్నప్పుడు శాంతి సాధ్యమని వెల్లడించింది. గాజా స్ట్రిప్‌పై ప్రతికార దాడులను నెహన్యాహు ప్రభుత్వం కొనసాగించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని, సమరశంఖాన్ని నిశ్శబ్దపర్చాలని, రాజకీయ పరిష్కారం దిశగా చర్యలు ఉండాలని, ఇందుకోసం నడుంబిగించాలని అంతర్జాతీయ సమాజానికి ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఇజ్రాయిల్‌లోని అరబ్ పౌరులకు వ్యతిరేకంగా ప్రతికార చర్యలు చేపట్టవద్దని నెతన్యాహు ప్రభుత్వాన్ని హెచ్చరించింది. చట్టాన్ని అతిక్రమించడం, హింసను పెంపొందించడం వంటి చర్యలకు వ్యతిరేకంగా గళమెత్తడం ఇజ్రాయిలీలు, అరబ్‌లు, యూదుల విధిగా సూచించింది. ప్రజల ఆంక్షలకు అనుకూలంగా నడుచుకోవాలని, వివక్ష, ఆధిపత్యం లేని సామాన్య జీవనానికి దోహదం కావాలని, ప్రతిఒక్కరికి ప్రశాంత జీవితం, సమానత్వం, నిజమైన ప్రజాస్వామ్యానికి హామీ ఉండాలని ఇజ్రాయిల్ కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

విశాలాంధ్ర ప్రపంచం

రాష్ట్రంలో నియంత పాలన

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర -భీమవరం: ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, తమ గోడు చెప్పుకునే వేదిక లేకుండా దుర్మార్గ పాలన సాగుతోందని, హక్కుల కోసం ఉద్యమిస్తుంటే జగన్ సర్కారు అరెస్టులు దాడులకు పాల్పడుతున్నదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో పాల్గొనడానికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా ప్రతిపక్షాలకు అపాయింట్మెంట్ ఇవ్వని ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. రాష్ట్రంలో పాలన అనేదే లేకుండా పోయిందని, 144వ సెక్షన్, 30 యాక్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రోడ్లు కడు దుస్థితిలో ఉన్నాయని, వ్యవస్థలు కుప్పకూలిపోయాయని, రైతు బరోసా కేంద్రాలు నామమాత్రంగా మిగిలాయనీ, రైతులకు కనీస మద్దతు ధర ఇప్పటికీ అందలేదని ముప్పాళ్ల అన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలపై 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వివిధ దశల్లో వామపక్షాలు ఆందోళనకు పిలుపునిచ్చాయని యావత్ ప్రజానీకం ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో జగన్, కేంద్రంలో మోదీని గద్దె దింపడానికి భావ సారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పనిచేస్తామని ముప్పాళ్ల తెలిపారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, బొద్దాని నాగరాజు, కళింగ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు .

ఇక యుద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర ప్రాంతంలో హమాస్‌కు మద్దతిచ్చే లెబనాన్‌లోని హెజ్బుల్లా మరో వేపు దాడులు చేస్తోంది. ఇజ్రాయిల్ స్థావరాల మీద హెజ్బుల్లా దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం హెజ్బుల్లా డజన్ల కొద్దీ రాకెట్లను ఇజ్రాయిల్‌లోకి ప్రయోగించింది. ఇజ్రాయిల్ ఆ దాడులను తిప్పికొట్టడానికి ప్రయత్నిస్తోంది. దీనివల్ల సరిహద్దు తగాదాలు తలెత్తుతాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హమాస్ కార్యకర్తలు భూమార్గం, సముద్రమార్గం, వాయు మార్గం ద్వారా ఇజ్రాయిల్ దక్షిణ ప్రాంతంలోకి ప్రవేశించారు. హమాస్ శనివారం చేసిన రాకెట్ దాడులతో ఇజ్రాయిల్ రక్షణ వలయాన్ని ఛేదించగలిగారు. ఇజ్రాయిల్ సైనికులతో సహా అనేకమందిని బందీలను చేసి పలస్తీనా పట్టణమైన గాజాకు తరలించారు. వారిని విడిపించడానికి ఇజ్రాయిల్, గాజాలలో కూడా విధ్వంసం సృష్టించే అవకాశం ఉంది. బందీలుగా పట్టుకున్న వారిలో మహిళలు, పిల్లలు, వృద్ధులు కూడా ఉన్నారు. గూఢచర్య కార్యకలాపాల్లో దిట్ట అయిన ఇజ్రాయిల్ రహస్య సమాచారం సేకరించడంలో విఫలమైనందువల్లే హమాస్ ఇంత భారీ ఎత్తున దాడి చేయగలిగిందని అనుకుంటున్నారు. యుద్ధం జరుగుతోందని, తమపై దాడికి దిగిన హమాస్ భారీ మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని నెతన్యాహూ హెచ్చరించారు. అయితే గాజా మీద కూడా ఇజ్రాయిల్ దాడి చేస్తుందా అన్నది అసలు ప్రశ్న. గతంలో గాజా మీద ఇజ్రాయిల్ దాడి చేసినప్పుడు అపార ప్రాణ నష్టం జరిగింది. ఈ యుద్ధం దీర్ఘ కాలం కొనసాగుతుందని, ఇది క్లిష్టమైన సమయం అని కూడా నెతన్యాహూ చెప్తున్నారు. తమ సైనిక శక్తినంతా వినియోగించి హమాస్ ను అంతమొందిస్తామని ఇజ్రాయిల్ ప్రధాని అన్నారు. హమాస్ కార్యకర్తలు దాగి ఉన్న చోట్లతో సహా, వారు కార్యకలాపాలు సాగించే ప్రాంతాల మీద కూడా దాడి చేస్తామని ఆయన అన్నారు. హమాస్ చేసిన దాడిలో 44 మంది సైనికులతో సహా కనీసం ఆరు వందల మంది పౌరులు మరణించారంటున్నారు. తమ సైన్యం 400 మంది హమాస్ కార్యకర్తలను మట్టుబెట్టిందని నెతన్యాహూ వెల్లడించారు. ఇజ్రాయిల్ దాడులకు గురి కాకుండా గాజాలోని ప్రజలు పలస్తీనా లోతట్టు భాగాలకు వెళ్లిపోతున్నారు. పొరుగున ఉన్న ఈజిప్టులోని అలెగ్జాండ్రియాలో ఒక పోలీసు ఇద్దరు ఇజ్రాయిలీ పర్యాటకులను కాల్చి చంపాడు. ఈజిప్టు ఇజ్రాయిల్‌తో రాజీ పడినప్పటికీ అక్కడి ప్రజలకు ఇజ్రాయిల్ మీద తీవ్రమైన వ్యతిరేకత ఉంది. మరో వేపున ఇజ్రాయిల్ రేర్ అడ్మిరల్ డేనియల్ హగారి గాజా సరిహద్దులోకి తమ సేనలు చేరుకున్నాయని చెప్పారు. ఇజ్రాయిల్ ఆక్రమించిన పలస్తీనా ప్రాంతాలలోకి తమ దళాలను, ఆయుధ సామాగ్రిని పంపుతున్నామని హమాస్ అంటోంది. తమ దాడులను "ఆపరేషన్ అల్-ఆక్సా స్టార్మ్" అంటున్నామని హమాస్ ప్రతినిధి చెప్పారు. శాంతి నెలకొనేట్లు చేయడానికి ఈజిప్టు ప్రయత్నిస్తోంది కానీ ఈ దశలో అది సాధ్యం కాదని నెతన్యాహూ వాదిస్తున్నారు. అమెరికాకు సన్నిహితంగా మెలిగే ఈజిప్టు హమాస్ దాడులను ఖండించకపోవడం విశేషం. పలస్తీనా ప్రజల హక్కులను ఇజ్రాయిల్ కాల రాస్తోందని మాత్రం ఈజిప్టు భావిస్తోంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో నెగ్గుకు రాలేనని భావిస్తున్న నెతన్యాహూ ప్రతిపక్షాలను కూడా కలిపి జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేసే సూచనలున్నాయి. దీనికి ప్రతిపక్షాలు కూడా సిద్ధంగానే ఉన్నాయి. నెతన్యాహూ ప్రభుత్వం అత్యంత మితవాద, నిష్క్రియాపరమైందని ఈ పరిస్థితిని అధిగమించలేదని ప్రతిపక్ష నాయకుడు లాపిడ్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు కొనసాగుతున్న ఘర్షణ 1973 నాటి విషాదకరమైన సందర్భాన్ని గుర్తు చేస్తోంది. ఈ ఘర్షణలు ప్రారంభమైన నేపథ్యంలో ఫ్రాన్స్ లో యూదుల పాఠశాలలవద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది.

గేర్ మార్చిన జగన్!

(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తాజాగా జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో ఎమ్మెల్యేల నుంచి గ్రామ, వార్డు స్థాయి వైసీపీ నాయకుల వరకు భాగస్వాములు అవుతారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెనుకబాటుకు గురైన ఎమ్మెల్యేలను సీఎం జగన్ హెచ్చరించిన విషయం విదితమే. వారి ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో ఐ ప్యాక్ టీమ్ నివేదికల ఆధారంగా వారి వివరాలను తెలుసుకుని ఒక జాబితాను రూపొందించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం కేంద్రంగా ఇప్పటివరకు నిర్వహించిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల సమీక్షలో ప్రతిసారి వెనుకబడిన వారిని హెచ్చరించి, వారంతా ఐ ప్యాక్ బృందాన్ని కలవాలని సీఎం ఆదేశించగా, ఇప్పటికే కొందరు కలిశారు. మరికొందరు సీఎంను నేరుగా కలిసి తమ వెనుకబాటు గల కారణాలను వివరించారు. వెనుకబాటుకు గురైన వారిలో మంత్రులు, సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నారు. సర్వేల ఆధారంగానే టికెట్లు ఉంటాయని, వచ్చే ఎన్నికల్లో వెనుకబాటుకు గురైన వారికి టికెట్లు ఉండబోవని ఇటీవల జరిగిన సమావేశంలో సీఎం తేల్చి చెప్పిన విషయం విదితమే. దీంతో దాదాపు 14 నుంచి 20 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఉండబోవనే ప్రచారం తెరపైకి వచ్చింది. అదే సమయంలో టికెట్లు రానివారంతా పనికి రారని, వచ్చిన వాళ్లే మంచి వాళ్లు అనే ఆలోచనలను విడనాడాలని సీఎం సూచించిన విషయం విదితమే. అనేక సర్వేల కారణంగా స్థానికంగా ప్రజల మనోభావాలను పొందలేని వారికి టికెట్లు ఇవ్వలేనని తేల్చి చెప్పారు. దీంతో వెనుకబాటుకు గురైన ఎమ్మెల్యేలు అంతా ఆందోళన చెందుతున్నారు.

ద్వితీయ శ్రేణికి దగ్గరవుతున్న సీఎం

సీఎం జగన్ కేవలం ఎమ్మెల్యేల పైనే ఆధారపడకుండా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకుగాను మండలంలోని ద్వితీయ శ్రేణి క్యాడర్‌తో భేటీకి సిద్ధమయ్యారు. కేవలం ఎమ్మెల్యేలను నమ్ముకుంటే పూర్తిస్థాయిలో న్యాయం జరగదనే ఉద్దేశంతో మండల స్థాయి నాయకత్వాన్ని అప్రమత్తం చేసి, మళ్లీ వైసీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా వారిని చైతన్యవంతులను చేయనున్నారు. ఇదే సమయంలో చంద్రబాబు అరెస్టు విషయం పైన రాష్ట్ర ప్రభుత్వంపై టీడీపీ శ్రేణులు చేస్తున్న ప్రచారాన్ని తిప్పి కొట్టేలా కూడా సీఎం సూచిస్తారని సమాచారం. ఎమ్మెల్యేలు, నియోజక వర్గాల ఇన్‌ఛార్జ్‌ల నేతృత్వంలో మండల స్థాయి ప్రతినిధులు విజయవాడకు తరలి రానున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టారు.

నేడు చంద్రబాబు కీలక కేసుల విచారణ

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అంగళ్లు, ఫైబర్ నెట్ కుంభకోణం, అమరావతి రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులపై చంద్రబాబు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేశారు. వాటి పైనా సోమవారం కీలక తీర్పులు వెలువడే అవకాశం ఉంది. విజయవాడ ఏసీబీ కోర్టులో చంద్రబాబు కస్టడీ, మధ్యంతర బెయిల్ పిటీషన్లపై ఇటీవల వాదనలు పూర్తయ్యాయి.

కీలకంగా మారిన ఏసీబీ కోర్టు తీర్పు

ఇప్పటికే రెండు రోజులపాటు చంద్రబాబును కస్టడీకి తీసుకున్న సీఐడీ మరో ఐదు రోజుల కస్టడీ కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసింది. కస్టడీ రెండు రోజులు తీసుకున్నారని, మీకు అవసరం లేదంటూ చంద్రబాబు తరపున న్యాయవాదులు వాదించారు. చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని పిటిషన్ వేశారు. వాటిపై వాడివేడిగా వాదనలు ముగిశాయి. తీర్పును ఈనెల 9వ తేదీకి న్యాయమూర్తి హిమబిందు వాయిదా వేశారు. దీంతో ఏసీబీ కోర్టు తీర్పు కీలకంగా మారింది. తీర్పు చంద్రబాబుకు అనుకూలంగా వస్తుందా? లేక వ్యతిరేకంగా వస్తుందా అనేది ఉత్కంఠగా మారింది. ఈ కేసులన్నీ నేడు సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పుల ఆధారంగా ముడిపడి ఉన్నాయి. చంద్రబాబుకు సెక్షన్ 17(ఎ) వర్తిస్తుందనే దిశగా ఆయన తరపు న్యాయవాదులు వాదిస్తున్నారు. దానికి విరుద్ధంగా చంద్రబాబుకు సెక్షన్ 17(ఎ) వర్తించబోదంటూ సీఐడీ, ప్రభుత్వం తరపున న్యాయవాదులు పోటీగా వాదిస్తున్నారు. ఈ వ్యవహారంతో సుప్రీంలో సెక్షన్ 17(ఎ) పై ఒక స్పష్టత రావడంతోనే చంద్రబాబుపై నమోదయిన కేసులు ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

మళ్లీ ఢిల్లీకి లోకేశ్

టీడీపీ నేత నారా లోకేశ్ మళ్లీ ఢిల్లీకి వెళ్లారు. తన తండ్రి చంద్రబాబు అరెస్టు అనంతరం యువగళం పాదయాత్రను రద్దు చేసుకుని ఢిల్లీ కేంద్రంగానే లోకేశ్ మకాం మార్చారు. ఈనెల 6న ఢిల్లీ నుంచి రాజమహేంద్రవరానికి లోకేశ్ వచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సెంట్రల్ జైలులో చంద్రబాబుతో ములాఖత్ అయ్యారు. లోకేశ్ మళ్లీ ఢిల్లీ వెళ్లారు. ఇప్పటికే ఢిల్లీలో రెండు రోజులుగా సీఎం జగన్ పర్యటించి, అమిత్ షాతో భేటీ నిర్వహించారు. అనంతర సీఎం రాష్ట్రానికి విచ్చేశారు. లోకేశ్ ఢిల్లీకి మళ్లీ వెళ్లడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. చంద్రబాబు అరెస్టు అనంతరం నుంచి ఏపీ టీడీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. తమ నేతను అక్రమంగా అరెస్ట్ చేశారంటూ ఆ పార్టీ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేశారు.

నారా లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణి, పార్టీ నేతలు ఈ నిరసనల్లో భాగస్వాములవుతున్నారు. సుప్రీం తీర్పుతో పాటు హైకోర్టు, ఏసీబీ కోర్టులలో చంద్రబాబుకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఆ పార్టీ శ్రేణులు ఎంతో ఆశతో ఉన్నారు. ఇదే సమయంలో సీఐడీ న్యాయవాదులు చంద్రబాబు కేసులపై రోజుకో అంశాన్ని తెరపైకి తేవడంతో ఈ కేసులపై అనుక్షణం ఉత్కంఠ నెలకొంది.

శిథిలమైన అఫ్గాన్

(మొదటిపేజీ తరువాయి)

దెబ్బతిన్నట్లు వెల్లడించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపులు జరుగుతున్నట్లు అధికారులు చెప్పారు. సహాయక, పునరావాస చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. తొలుత వెయ్యి మంది మరణించినట్లు వార్తలు వచ్చాయి. హెరాత్ ప్రావిన్స్‌కు వాయువ్యంగా 40 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. భూకంపం వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలలోని ప్రజలు భయంతో బయటికి పరిగెత్తారు. రిక్టర్ స్కేల్‌పై 6.3 తీవ్రతతో సంభవించిన ప్రధాన భూకంపం తర్వాత 5.5, 4.7, 6.3, 5.9, 4.6 చొప్పున తీవ్రతతో ఐదుసార్లు భూకంపాలు వచ్చాయి. అరగంటలోనే మూడు భూకంపాలు సంభవించాయి. అఫ్గానిస్తాన్ విపత్తు నిర్వహణ దళాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. పట్టణాల్లో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని.. గ్రామాల్లో కొండచరియలు విరిగిపడి భారీగా ప్రాణనష్టం సంభవించినట్లు మీడియా తెలిపింది. గాయపడిన వేలాది మంది వివిధ నగరాల్లోని ప్రధాన ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు వెల్లడించారు. కాగా, ఇల్లు కూలి ఒకే కుటుంబానికి చెందిన 11 మంది సమాధి అయినట్లు మీడియా తెలిపింది. హెరాత్ ప్రావిన్స్‌లో భూకంపాలు తరచుగా సంభవిస్తుంటాయి. గతేడాది జూన్‌లో 5.9 తీవ్రతో సంభవించిన భూకంపంలో వెయ్యి మంది చనిపోగా 10వేల మంది నిరాశ్రయులయ్యారు. ఈ ఏడాది మార్చిలో అఫ్గానిస్తాన్, పాకిస్తాన్ సరిహద్దుల్లో 6.5 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల 13 మంది చనిపోయారు.

18న కడపలో సీపీఐ సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు కల్పించిందని స్పష్టం చేశారు. మళ్లీ మూడు రాష్ట్రాల విజ్ఞప్తి మేరకు ఏర్పాటైన బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ గతంలో బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను యధావిధిగా అమలు చేస్తూనే, మిగులు జలాలను కూడా 448 టీఎంసీలుగా లెక్కగట్టి మూడు రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తూ తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు పర్యావసానంగా మిగులు జలాలపై ఆధారపడి నిర్మిస్తున్న గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగొండ, తెలుగు గంగ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు అమలయితే రాయలసీమ శాశ్వత ఎడారిగా మారుతుందని గ్రహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గత ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసిందని తెలిపారు. ఒకవైపు కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉండగానే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. నీటి వివాదాలపై ట్రిబ్యునల్ తుది తీర్పు సుప్రీంకోర్టులో విచారణలో ఉండగా కేంద్ర ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలంటూ సుప్రీంకోర్టు అడుగగా, బీజేపీ ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు యధావిధిగా అమలు చేయాలని అఫిడవిట్ దాఖలు చేయడం విచారకరం అన్నారు.

రాజకీయ లబ్ధి కోసం ప్రధాని మోదీ కృష్ణ జలాల పునః పంపిణీ ప్రక్రియ కేవలం రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితం చేస్తూ, మళ్లీ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కే కట్టబెడుతూ చేసిన తీర్మానం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ముఖ్యంగా రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. నాలుగు రాష్ట్రాల మధ్య ఉన్న నీటి సమస్యను కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండు రాష్ట్రాలకే పరిమితం చేసి, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కేటాయించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం మరోసారి ఏపీకి ద్రోహం తలపెట్టిందని, ఏపీకి ప్రత్యేక హోదా, వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ, జాతీయ హోదా కలిగిన పోలవరానికి నిధుల కేటాయింపు, అమరావతి రాజధాని నిర్మాణం వంటి విషయాలలో అడుగడుగునా మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలు దృష్ట్యా జగన్‌మోహన్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, కృష్ణాజలాల పునః పంపిణీ విషయంపై కేంద్ర ప్రభుత్వంతో, కేంద్ర జల సంఘంతో చర్చించాలని కోరారు.

రాష్ట్రంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 18వ తేదీన భారత కమ్యునిస్టు పార్టీ ఆధ్వర్యంలో కడప నగరంలో సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రాజకీయ పక్షాలు, రైతు సంఘాలు, సాగునీటి రంగ నిపుణులు పాల్గొనున్న ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

సర్టిఫికెట్ల జాప్యానికి కారకులెవరు?

(మొదటిపేజీ తరువాయి)

సీఎం జగన్‌కు ఆంధ్ర ప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్, విద్యార్థులు ఫిర్యాదు చేసిన తర్వాతే బోర్డు అధికారుల్లో కాస్త కదలిక వచ్చింది. ఇంతవరకు అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి-2023 ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 8.7 లక్షల మంది హాజరయ్యారు. వారిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 3.8 లక్షల మంది హాజరువగా 2.66 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 4.33 లక్షల మంది హాజరు కాగా, 2.72 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. అటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఇన్‌స్టెంట్ పరీక్షలు మే 15 నుంచి జూన్ 2 వరకు 2 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఇంటర్ మార్చి-2023 పబ్లిక్ పరీక్షలకు చెందిన ఫలితాలు విడుదలై ఐదు నెలలు కావస్తున్నప్పటికీ, ఇంతవరకు విద్యార్థులకు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను అందించడంలో బోర్డు పూర్తిగా విఫలమైందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల హాజరయ్యేందుకు ఇంటర్ బోర్డు వారికి రూ.510, సైన్స్ గ్రూపు విద్యార్థులు లేబరేటరీ పరీక్షలకు రూ.200 చొప్పున చెల్లించారు. ఇంత పెద్ద మొత్తంలో విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసి వారికి సకాలంలో ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వలేకపోయారు. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కౌన్సెలింగ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి. విద్యార్థులు ఆయా కళాశాలల ప్రవేశాల సమయంలో ఇంటర్ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంది. అవి అందుబాటులో లేనందున చాలామంది ప్రవేశాలు గందరగోళంగా మారాయి.

డిజీ లాకర్‌పై అవగాహన ఏదీ?

ఇంటర్ ఉత్తీర్ణులైన వారి ధ్రువీకరణ పత్రాలను డిజీ లాకర్‌లో ఉంచామంటూ బోర్డు అధికారులు చేసిన ప్రకటన అక్షేపణీయంగా మారింది. డిజీ లాకర్‌తో విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం కలిగిందంటూ తల్లిదండ్రులు, పేరెంట్స్ అసోసియేషన్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఆన్ లైన్ ద్వారా డిజీ లాకర్‌లోకి వెళ్లి ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకునే అవగాహన ఎంతమందికి ఉంటుందనేది ప్రభుత్వం గుర్తెరగాలి. ఈ విధానంలో 2014 నుంచి 2023 వరకు 45.43 లక్షల ఇంటర్ ధ్రువీకరణ పత్రాలను అప్ లోడ్ చేశామంటూ బోర్డు ఆర్భాటంగా వెల్లడించింది. ఇప్పటికే 2018లో సీబీఎస్ఈ డిజీ లాకర్ విధానాన్ని తీసుకొచ్చింది. దీనిని ఇంటర్ బోర్డు కొత్తగా ప్రవేశపెట్టింది కాదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు, తల్లిదండ్రులకు డిజీ లాకర్‌పై అంత అవగాహన ఉండదు. అందరికీ స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో లేనందున చాలా మంది పత్రాలను డౌన్ లోడ్ చేసుకోలేదని సమాచారం. కరోనా సమయంలో ఇంటర్ ఆన్ లైన్ విద్యా విధానం ప్రవేశపెట్టి విఫలమైన విషయం విదితమే. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్ ఆన్ లైన్ తరగతులను సరిగ్గా బోధించలేక విమర్శలకు గురైంది.

మరో రెండు వారాలు పడిగాపులేనా!

సీఎం జగన్‌కు ఫిర్యాదులు రావడంతో ఈనెల 7 నాటికి ఇంటర్ ధ్రువీకరణ పత్రాల ప్రక్రియను పూర్తి చేసి, 10వ తేదీన ఇంటర్ ఆర్ఐవో కార్యాలయాలకు వాటిని పంపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. 12 నుంచి ఆర్ఐవో కార్యాలయాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్ కళాశాలలకు పంపిణీకి ప్రణాళిక రూపొందించారు. అవి విద్యార్థులకు ఎప్పుడు చేరుతాయనేదీ ప్రశ్నార్థకంగా మారింది. ఈ మొత్తం ధ్రువీకరణ పత్రాల పంపిణీ ప్రక్రియ పూర్తవ్వడానికి మరో రెండు వారాలకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోగా విద్యార్థులు, తల్లిదండ్రులు కళాశాలలకు ఫోన్ చేసి, అవి ఎప్పుడు వస్తాయో అనే దిశగా ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇంటర్మీడియట్ 2023 పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ పత్రాలను బోర్డు డిజీ లాకర్‌లో ఉంచి, హార్డ్ కాపీలను ఇంతవరకు కళాశాలలకు పంపలేదు.

ఇంటర్ బోర్డు వెబ్ సైట్ ద్వారా 3.73 లక్షల మంది డౌన్ లోడ్ చేసుకున్నారని అధికారులు వెల్లడించినా, వాటి వల్ల అంత ప్రయోజనం ఉండబోదని, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు వస్తేనే ఉపయోగమని తల్లిదండ్రులు నొక్కి చెబుతున్నారు. విద్యార్థులు వారి ధ్రువీకరణ పత్రాల కోసం నగదును చెల్లించినప్పటికీ, వారికి సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలో ఇంటర్ బోర్డు విఫలమైందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సీఎం జగన్ ప్రభుత్వం స్పందించి ఇంటర్ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల జాప్యంపై ప్రత్యేక విచారణ కమిటీ వేసి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు వేగవంతంగా ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకుని, వారి విద్యా ప్రవేశాలకు ఆటంకం లేకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అసమర్థ ముఖ్యమంత్రి జగన్

- అందువల్లే కృష్ణా జలాలపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్
- ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం
- అఖిలపక్ష సమావేశం పెట్టాలి... కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో రామకృష్ణ, దేవినేని ఉమా, మస్తాన్‌వలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థత వల్లనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు విమర్శించారు. స్థానిక రామన్నపేట 1వ లైనులో ఉన్న జన చైతన్య వేదిక ఆంధ్ర ప్రదేశ్ అధ్వర్యంలో కృష్ణా జలాల పున: పంపిణీపై ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కృష్ణా జలాల విషయంలో ఏపీకి తీరని అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి ఎన్నికలు వచ్చినా దాని ప్రభావం మన రాష్ట్రంపై పడుతున్నాయని తెలిపారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో రెండవసారి బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఎగువ భద్రను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి దాదాపు రూ.5,600 కోట్లు కేటాయించారని చెప్పారు. వాస్తవానికి ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు రెండూ కూడా ఎగువ భద్ర ప్రాజెక్టుకు వ్యతిరేకంగా వాదనలు వినిపించినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ జిల్లాలోని తుంగభద్ర ప్రాజెక్టుపై ఆధారపడి జీవిస్తున్న వారందరూ ఇబ్బందులు పాలవుతారన్నారు. సీఎం జగన్ ఢిల్లీలో ఉండగానే కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందంటే ఆంధ్ర రాష్ట్ర ప్రజలపై, అలాగే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిపై కేంద్రానికి ఏపాటి గౌరవం ఉందో అర్థమవుతుందని అన్నారు. కృష్ణా జలాలు అతి చిన్న సమస్యగా సీఎం జగన్ భావిస్తున్నారేగానీ అసలు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి తెలుసుకోలేకపోతున్నారని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలను సక్రమంగా వినియోగించు కోవడానికి అవకాశం లేకుండా చేస్తున్నారని విమర్శించారు. జలాలు, విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రత్యేక హోదా విషయంలో కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే మాట్లాడలేని అసమర్థత సీఎం వైఎస్ జగన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలాల విషయంలో రాష్ట్రానికి అన్యాయం జరిగితే జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోతాడని హెచ్చరించారు. నదీ జలాలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం పెట్టాలని డిమాండ్ చేశారు. ఆ సమావేశానికి రైతు నాయకులు, నీటిపారుదల నిపుణులను ఆహ్వానించాలని కోరారు. పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ రెండు కార్యక్రమాలు చేపట్టకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలను సమీకరించి ప్రత్యక్ష పోరాటానికి సమాయత్తం అవుతామని హెచ్చరించారు. నీటిపారుదల శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అపెక్స్ కౌన్సిల్‌లో సభ్యునిగా ఉండి రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడకపోవడం, ఆ పార్టీకి చెందిన 30 మంది ఎంపీలు నోళ్లు తెరవకపోవడం వలనే మనకు కృష్ణా జలాల పంపిణీలో అన్యాయం జరిగిందన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ కృష్ణా జలాలు కృష్ణార్పణం అని, ఆంధ్ర రాష్ట్ర రైతాంగం ఆత్మహత్యల మరణ మృందంగం కాబోతున్నారని అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం బీడు కాబోతుందని, ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న జగన్ ఈ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడా లేక మోదీ చేతిలో రిమోట్ మోడ్ అయ్యాడో ప్రజలు గమనించాలని కోరారు. జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను కాపాడటంలో విఫమైందని ఆరోపించారు. ఏపీలో నీటి పారుదల ప్రాజెక్టులకు సీఎం జగన్ ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకపోవడం శోచనీయమని అన్నారు. అధ్యక్షత వహించిన జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాల విషయంలో సీఎం జగన్ తక్షణమే చొరవ తీసుకుని అన్ని రాజకీయ పార్టీలు, రైతాంగ సంఘాల నేతల బృందాన్ని ప్రధాని మోదీ వద్దకు తీసుకువెళ్లాలని కోరారు. సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేసి సత్వరం న్యాయపోరాటం చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు రైతు సంఘం అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ప్రోగ్రెసివ్ ఫోరం నేత రాధాకృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి, సీపీఐ (ఎంఎల్) నాయకుడు ఎన్.బ్రహ్మయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, రైతు నాయకులు కల్లం రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై అఖిలపక్ష సమావేశం వేయాలి

ముఖ్యమంత్రికి సీపీఎం లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణా జలాల సమస్య పరిష్కరించేందుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు ఆదివారం ఆయన ఒక లేఖ రాశారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణాల మధ్య కృష్ణా నీటి కేటాయింపుల పున: పరిశీలనకు కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రయోజనాలను, హక్కులను దెబ్బతీస్తోందన్నారు. రెండు రాష్ట్రాలు కోరితేనే కేంద్రం జోక్యం చేసుకోవాలని, ఇలా ఏకపక్షంగా నిర్ణయించడం, గెజిట్ విడుదల చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి కోసం బీజేపీ సారధ్యంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆపేందుకు సీఎం వ్యక్తిగత పలుకుబడిని ఉపయోగించాలని కోరారు. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా, అది రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన నీటిని రాష్ట్ర విభజన చట్టంలో ఉభయతారకంగా రెండు రాష్ట్రాల మధ్య పంపకం జరిగిందని గుర్తుచేశారు. దీనిని తిరగదోడటానికి మన రాష్ట్ర ప్రభుత్వం అనుమతించవద్దని, న్యాయ స్థానాల ద్వారా పోరాటం చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వంపై రాజకీయంగా ఒత్తిడి తేవాలని పేర్కొన్నారు. అందుకు రాష్ట్ర ప్రజల, అన్ని పార్టీల మద్దతును కూడగట్టాలని, దానికోసం తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. ఒకరోజు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించి కృష్ణా జలాల పంపిణీ పున: సమీక్ష నిర్ణయాన్ని ఆపాలని తీర్మానించి దానిని కేంద్రానికి పంపాలని కోరారు. రాష్ట్రం హక్కుల పరిరక్షణ కోసం సీఎం జగన్ నాయకత్వంలో ప్రధాని వద్దకు అఖిలపక్ష కమిటీని తీసుకువెళ్లాని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

- అర్హులందరికీ ఓపీఎస్, అన్ని కేటగిరీలకు పదోన్నతులు ఇవ్వాలి
- ఏపీ జేఏసీ అమరావతి నేతలు బొప్పరాజు, పలిశెట్టి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ తోపాటు 2017 పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఏపీ పీటీడీ (ఆర్టీసీ)ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం విజయవాడ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర కార్యాలయంలో దామోదరరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సెప్టెంబర్ 30వ తేదీలోగా ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లిస్తామని అంగీకరించిన మూడేళ్ల లీవ్ ఎన్‌క్యాష్‌మెంటును పీటీడీ ఉద్యోగులకు ఇంకా చెల్లించకపోవడంపై నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పీటీడీ ఉద్యోగులకు ప్రతి నెలా చెల్లించాల్సిన నైట్ అవుట్, డెయిలీ అలవెన్సులు, ఓటీ అలవెన్సులను వేతనంతోపాటు చెల్లించాలని, కేడర్ స్ట్రెంగ్త్ సర్దుబాటు పేరుతో ఉద్యోగులను తగ్గించే చర్యలను విడనాడి సమస్యను పరిష్కరించాలన్నారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్ ఆదేశాలను అమలు చేయాలని, కొంత మంది సూపర్ వైజర్లను, అధికారుల పక్షపాత వైఖరితో కిందిస్థాయిలో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నందున ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సరిచేయాలని నేతలు కోరారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొప్పరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిల విషయమై ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు పాతపద్ధతిలో పదోన్నతులు రాబోతున్నాయని, అలాగే వారికి వైద్యసౌకర్యాలు కల్పించేందుకు, ఖాళీలను భర్తీ చేయించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వ పరిధిలో ఏ ఒక్క సమస్య ఉన్నప్పటికీ, వాటి పరిష్కారానికి ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందన్నారు.

ఏపీ పీటీడీ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ... డిపో, యూనిట్లలో జిల్లాపరిధిలో ఉన్న సమస్యలపై త్వరలో అన్ని జోన్ కేంద్రాలలో జోనల్ ఎగ్జిక్యూటివ్ సమావేశాలు ఏర్పాటు చేసుకుని... జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు వినతి పత్రాలను అందజేస్తామని వివరించారు. అవసమైతే జోన్ స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించిందని చెప్పారు. ఏపీ పీటీడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ... బకాయిలు, హయ్యర్ పెన్షన్ డబ్బుల చెల్లింపులు తదితర సమస్యలు పరిష్కారం కోసం ఆర్టీసీ ఎండీకి లేఖ ఇవ్వాలని రాష్ట్ర కార్యవర్గంలో నిర్ణయించామని వివరించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఈయూకి ప్రభుత్వం గుర్తింపు ఇప్పించడంలో కీలక పాత్రపోషించిన బొప్పరాజును ఈయూ రాష్ట్ర కమిటీ సత్కరించింది. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జి.ఓబులేసు, పి.సుబ్రహ్మణ్యం రాజు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, ఉప ప్రధానకార్యదర్శులు జి.నారాయణరావు, ఎండీ ప్రసాద్, పి.భానుమూర్తి తోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు, నాలుగు జోన్లు, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, వర్క్‌షాప్‌ల రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అటకెక్కింది

- న్యూస్ క్లిక్ జర్నలిస్టులపై దాడి రాజ్యాంగంపై దాడి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

విశాలాంధ్ర బ్యూరో-రాజమహేంద్రవరం: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్వహిస్తున్న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలపై పోలీసులతో నిర్బంధకాండ కొనసాగిస్తున్నారని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యమే లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం కె.జ్యోతి రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వనజ విలేకరులతో మాట్లాడుతూ మీడియాపై మోదీ ప్రభుత్వం ఉక్కు పాదం మోపిందని, మోదీ అవలంబిస్తున్న విధానాలపై వాస్తవాలు బయటకు రాకుండా చేయడానికి న్యూస్ క్లిక్ జర్నలిస్టులపై దాడి చేసి, అక్రమ అరెస్టులు బనాయించారని, ఇది రాజ్యాంగానికి మాయని మచ్చని అన్నారు. దేశవ్యాప్తంగా ఎన్ఐఏ ప్రజాస్వామ్యవాదులు, వామపక్ష భావజాలంతో పని చేస్తున్న వారిపై దాడులు చేయడం చాలా సిగ్గుచేటని ఆమె విమర్శించారు. కృష్ణ, గోదావరి నదీ జలాల పంపిణీ సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ ప్రజల ప్రయోజనాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి... మోదీకి తాకట్టు పెట్టారని, ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉండగానే నోటిఫికేషన్ విడుదల చాలా ఘోరమన్నారు. కృష్ణా జలాలపై ప్రతిపక్షాలు, రైతుల నేతలతో ముఖ్యమంత్రి సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసిన విధానం చాలా ఘోరమని, జగన్‌ను కలుపుకుని మోదీ వ్యవస్థ లను నాశనం చేస్తున్నారని, టీడీపీ చేసే ప్రతి పోరాటానికి సీపీఐ మద్దతు ఉంటుందని ఆమె తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శులు కొండ్రపు రాంబాబు, రేఖ భాస్కరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.కొండలరావు, తోట లక్ష్మణ్, చింతలపూడి సునీల్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

12 నుంచి అంతరాష్ట్ర క్రికెట్ టోర్నీ

విశాలాంధ్ర-మంగళగిరి: అంతర్రాష్ట్ర అండర్-19 పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఈ నెల 12వ తేదీ నుంచి మంగళగిరి, మూలపాడు క్రికెట్ స్టేడియాల్లో ప్రారంభం కానున్నాయని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూలపాడులో ఉన్న డీవీఆర్, సీపీ గ్రౌండ్, మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ స్టేడియంలో ఢిల్లీ, మహారాష్ట్ర, బెంగాల్, మేఘాలయ, హైదరాబాద్, ఉత్తరాఖండ్ జట్లు ఈ టోర్నీలో పాల్గొంటాయని వెల్లడించారు. ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం ఉంటుందన్నారు. మంగళగిరి స్టేడియంలో మరో ఆరు నెలల పాటు సందడి నెలకొనేలా మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించి బీసీసీఐ ఈ టోర్నీని రాష్ట్రానికి కేటాయించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ఇందులో భాగంగానే రూ.15 కోట్లతో మంగళగిరి స్టేడియంలో ఫ్లడ్ లైట్లు వేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ జాయింట్ సెక్రటరీ ఏ రాకేష్, అపెక్స్ కౌన్సిల్ మెంబర్లు కేవీ పురుషోత్తంరావు, ఎన్ గీత, గుంటూరు క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పప్పి, సీఈఓ డాక్టర్ ఎం వెంకట శివారెడ్డి, సెంట్రల్ జోన్ అకాడమీ కన్వీనర్ డి.రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా వైసీపీ ప్రతినిధుల సమావేశం

ప్రభుత్వ సలహాదారు సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం జరగనున్న వైసీపీ ప్రతినిధుల విస్తృసమావేశాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. అభివృద్ధి-సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం, ప్రభుత్వంపై ప్రతిపక్షాల విషప్రచారాన్ని తిప్పికొట్టడం, జైలులో ఉన్న అవినీతి పరుల గురించి వాస్తవాలు ప్రజలకు తెలియచేయడం లాంటి అంశాలపై సీఎం జగన్ మండలస్థాయి నేతలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. వైసీపీ ప్రతినిధుల సమావేశం జరగనున్న విజయవాడ ఇంధిరాగాంధి మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లను సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్రమంత్రి జోగి రమేశ్, పార్టీ అనుబంధ విభాగాల ఇన్ చార్జ్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ముఖ్య మంత్రి కార్యక్రమాల కో-ఆర్డినేటర్ తలశిల రఘురామ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆదివారం పరిశీలించారు. సభా వేదికతోపాటు ఎన్ని ద్వారాల ఏర్పాటు చేశారు... పార్టీ ప్రతినిధులలో ఎవరెవరు ఏ ఏ ప్రవేశమార్గాల నుంచి సమావేశ మందిరంలోకి ప్రవేశిస్తారనే విషయాలపై పోలీసు అధికారులను ఆరా తీశారు. సమావేశానికి హాజరయ్యే వారికి భోజన ఏర్పాట్లు, తదితర అంశాలను పరిశీలించారు. హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై వివిధ సూచనలు చేశారు. ఈ సందర్భంగా సజ్జలకు స్టేడియం చుట్టుపక్కల భద్రతా ఏర్పాట్లను విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణాటాటా వివరించారు. పార్టీ అధ్యక్షులు, సీఎం జగన్ హాజరవుతున్న దృష్ట్యా విస్తృత భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజలకు, ట్రాఫిక్ కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సజ్జల చెప్పారు. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడుతూ... జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్యసురక్ష వంటి పథకాలు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయన్నారు. నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పథకాలు, విప్లవాత్మక సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని చెప్పారు. ప్రజలు వాటిని ఆదరిస్తున్నారని, వారి నుంచి జగనన్న పాలనకు ఆదరణ లభిస్తోందన్నారు. మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ... జగనన్న ముఖ్యమంత్రిగా కొనసాగడం ఐదుకోట్ల మంది ప్రజలకు చారిత్రాత్మక అవసరమని అన్నారు. జగన్‌ను రాష్ట్రం లోని ప్రతి ఒక్కరూ గుండెల్లో పెట్టుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్, వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్ రెడ్డి, పార్టీ గ్రీవెన్స్ సెల్ చైర్మన్ నారాయణమూర్తి, పార్టీ నేతలు చల్లా మధుసూదనరెడ్డి, పుత్తా ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు: బాలకోటయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల కోరుతూ అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య ఆదివారం తన పుట్టినరోజును పురస్కరించుకుని మందడం, తుళ్లూరు దీక్ష శిబిరాలలో దీక్ష చేశారు. ఈ సందర్భంగా బాల కోటయ్య మాట్లాడుతూ... అమరావతిని నిర్మించిన చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టిన సీఎం జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. పోలీసుల నిర్బంధాలు, అరాచకాలతో ప్రజల్ని పాలించాలని చూసినా, ప్రతిపక్షాలను కట్టడి చేయాలని తలచినా ప్రజాస్వామ్యంలో చెల్లుబాటు కాదని చెప్పారు. 29 రోజులుగా అక్రమ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబును బంధించి, వైసీపీ ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అమరావతి రైతు జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్, సీపీఐ నాయకులు గుంటుపల్లి వెంకటేశ్వరరావు, వడ్లమూడి రమణయ్య, కట్టా రాజేంద్ర, ఆడిటర్ పరంధామయ్య పాల్గొన్నారు.

గుండ్లకమ్మ మరమ్మతులకు వెంటనే నిధులు కేటాయించాలి

- ఆయకట్టు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమా రెడ్డి
- నేడు కలెక్టరేట్ వరకు ప్రదర్శన, సభ

విశాలాంధ్ర-ఒంగోలు: గుండ్లకమ్మ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి, పనులు పూర్తి చేసేంతవరకు ఉద్యమం ఆగదని గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమా రెడ్డి అన్నారు. ప్రాజెక్టు మరమ్మతులకు వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నాలుగు రోజులుగా గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం అధ్వర్యంలో పాదయాత్ర విజయవంతంగా కొనసాగుతోంది. పాదయాత్ర దళం నాల్గవ రోజు బొద్దులూరివారి పాలెంలో బయలుదేరి ఉలిచి, కరవది, ఉలేటివారిపాలెం, త్రోవగుంట గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంగా ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సాగు చేసుకోవడం సాధ్యం కాలేదని, గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి నీరు ఇచ్చే ఆశ లేదని రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా హనుమాన్ రెడ్డి మాట్లాడుతూ 14 నెలల క్రితం గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో గేటు కొట్టుకుపోయినా ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం అన్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రకటనలకు పరిమితమవుతున్నారే తప్ప పనులు ప్రారంభించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. 80 వేల ఎకరాలకు సాగు నీరు, సుమారు ఐదు లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో రూ.647 కోట్లు ప్రజాధనం ఖర్చుపెట్టి నిర్మించిన గుండ్లకమ్మ ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను వివిధ రూపాలలో ప్రభుత్వ అధికారులకు తెలియజేసినా, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువచ్చినా స్పందించలేదన్నారు. దీంతో నాలుగు రోజుల నుంచి గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం అధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. పాదయాత్ర 9వ తేదీ ఉదయం అద్దంకి బస్టాండ్‌లోని ఎన్టీఆర్ బొమ్మ వద్ద నుంచి ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా కార్యక్రమం, అనంతరం సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు, ప్రజలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జమాల్ సవాల్ రిజిస్ట్రేషన్ జిల్లా కార్యదర్శి టి.వి.శేషు, సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పి.వి.ఆర్.చౌదరి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, లింగ ఆంజనేయులు, సీహెచ్ వాసు, పావులూరి అంజయ్య, అనేక మంది రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన అభ్యుదయ గీతాలు ప్రజలను ఆలోచింపజేశాయి.

మిత్ర దేశాల మధ్య స్నేహ, సాంస్కృతిక సంబంధాలకు కృషి

ఇస్కఫ్ జాతీయ సమితి చైర్మన్ భానుదేవ్ దత్తా

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: సామ్రాజ్యం వాదానికి వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం ఇస్కఫ్ ముందుకు సాగుతుందని ఇస్కఫ్ జాతీయ సమితి చైర్మన్ భానుదేవ్ దత్తా అన్నారు. ఆదివారం విశాఖపట్నం అల్లూరి భవన్‌లో జరిగిన ఇస్కఫ్ జాతీయ సమితి రెండవ రోజు ముగింపు సమావేశంలో భానుదేవ్ దత్తా మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం తాము ప్రయత్నిస్తున్నామన్నారు. ఇతర దేశాలతో, అలాగే, మన దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య సాంస్కృతిక, స్నేహబంధాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పొరుగున ఉన్న మిత్ర దేశాలలో ఇస్కఫ్ ప్రతినిధి బృందం అక్కడి ప్రజలతో సాంస్కృతిక సంబంధాలకు కృషి చేస్తోందని అన్నారు. చైనా, వియత్నాం, క్యూబా, లావోస్ మొదలైన దేశాల నుంచి ప్రతినిధులు కూడా మన దేశానికి వచ్చి ఇక్కడి వారితో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నారన్నారు. 1941లో ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్‌తో మొదలై 1951లో ఇండో-సోవియట్ కల్చరల్ సొసైటీ స్థాపించామన్నారు. 1992లో ఇస్కఫ్ ఏర్పాటయిందని ఆయన తెలిపారు. నూతన ఆలోచనలు, కొత్త నాయకత్వంతో ఇస్కఫ్ నిరంతరం పని చేస్తోందన్నారు. సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్ కుమార్ పధిహారి మాట్లాడుతూ యువత ఇస్కఫ్ నాయకత్వంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నూతన ఆలోచనలతో దేశంలోని అన్ని ప్రాంతాల మధ్య సాంస్కృతిక సత్సంబంధాలు ఏర్పాటు అవుతాయన్నారు. జాతీయ సమితి సమావేశంలో భాగంగా అనేక ముఖ్యమైన తీర్మానాలను ఆమోదించారు. ప్రధానంగా మణిపూర్‌లో జరుగుతున్న హింసను ఆపాలని, స్థానికంగా జరుగుతున్న పరిణామాలపై నిజ నిర్ధారణ కమిటీ అక్కడ పర్యటించాలని తీర్మానం చేశారు. మణిపూర్ మాజీ మంత్రి నారా సింగ్ కమిటీ పర్యటించి స్థానికంగా జరుగుతున్న వాస్తవాలను తెలుసుకొని నివేదిక అందజేస్తారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలు, నేపాల్‌లోని సంఘటనపై కూడా ప్రత్యేక కమిటీ పర్యటించనుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూడాలని ప్రత్యేక తీర్మానం చేశారు. ఇస్కఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు మాధవరావు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సెయిల్‌లో విలీనం చేయాలని, స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కోరారు. రా మెటీరియల్ లేకపోవడంతో స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. రెండు లక్షల కోట్ల విలువైన స్టీల్ ప్లాంట్ సంపదను రూ.35 వేల కోట్లకు విక్రయించడంలో కేంద్రం కుట్ర దాగి ఉందని విమర్శించారు. జాతీయ సమితి సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, అసోం, పంజాబ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, మణిపూర్, చత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్ తదితర రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులను మెమెంటోలతో సత్కరించారు. మాజీ ఎంపీ, అధ్యక్ష వర్గ సభ్యులు అజీజ్ పాషా, మణిపూర్ మాజీ మంత్రి నారా సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు టి.ఎస్.సుకుమారన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నరసింహులు, రాష్ట్ర ప్రతినిధి జహీనారా, ఆహ్వాన సంఘం కోశాధికారి సత్యాంజనేయులు, ఆహ్వాన సంఘం రాష్ట్ర కార్యదర్శి జె.వి.ప్రభాకర్, విశాఖ జిల్లా అధ్యక్షులు ఉప్పల అప్పలరాజు, ప్రజానాట్య మండలి కోశాధికారి జి.పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మినీ కవిత వేమనలాగ చిరంజీవి

సాహితి

ఎస్.ఆర్.పృథ్వి
సెల్: 9989223245

తెలుగు సాహిత్య రంగం ఎన్నో ఒడుదుడుకులను అధికమించి, మరెన్నో రూపాలకు జీవం పోసి, తన పరిధిని అనంతంగా విస్తృతపర్చుకొంది. ప్రాచీన సాహిత్యం కొందరికి సొంతమైతే, ఆధునిక సాహిత్యం మరెందరినో వారసులుగా మలుచుకొంది. ఆధునికతను సంతరించుకున్న తెలుగు సాహితీ ప్రక్రియలలో వచన కవిత తర్వాత మినీ కవితను పేర్కొనాల్సి ఉంది. మినీ కవిత నూతన కవితా ప్రక్రియగా 1980 ప్రాంతంలో తెలుగువాకిట నిలిచింది. ఈ ప్రక్రియ పట్ల ఆ రోజుల్లో కొందరు పెదవి విరిచినా, యువతను బాగా ఆకర్షించి, కవులుగా తీర్చిన గొప్పదనం దీనిది. ఈ మినీ కవిత తత్వాన్ని తొలి నాళ్లలోనే విమర్శనాత్మకంగా పరిశీలించి, ఒక గ్రంథాన్ని అందించిన అద్దేపల్లి రామమోహనరావు "ఒకే భావాన్ని సాధ్యమైనంత శక్తిమంతంగా హృదయంలో ముద్ర పడేటట్లు ధ్వని పూర్వకంగా చెప్పడానికి మినీ కవిత ఉపకరిస్తుంది. అందుకే దీనిని ఫ్లాష్ పొయిట్రీ అనవచ్చు" అని నిర్వచించడం జరిగింది.

మినీ కవిత లక్షణాలను, లక్ష్యాలను గనుక చూస్తే, ఆశ్చర్యం కలుగుతుంది. చెప్పదలచుకున్న విషయం భావ స్ఫూర్తితో, భాషా పటిమతో, అతి తక్కువ పదాలతో ఉండడమే దీనిలోని విశేషం. ఇక్కడ భాషా పటిమ అంటే- జటిలమైన పదాల పొందిక కాదు. ఒక్కసారి చదవగానే హృదయంలోకి దూసుకుపోయే సులభ శైలి అని అర్థం. ఉత్తేజకరమైన భావాన్ని, కవితలో ఒకచోట తళుక్కుమని మెరిపించి, పాఠకుడి హృదయంలోకి చొప్పించి, ఆలోచన రేకెత్తించాలి. ఉదాహరణకు- "కష్ట పడిన వాడికి/ ప్రతిఫలం- తూచి, తూచి/ స్వామీజీల పాద పూజకి/ వేలు, లక్షలు- దాచి, దాచి"

ఆధునిక తెలుగు సాహిత్యంలో నక్షత్రాల్లా మెరుస్తున్న మినీ కవితా ప్రక్రియకి దాదాపుగా నాలుగు దశాబ్దాల పైన చరిత్ర ఉంది. ఆ చరిత్రలో డా॥రావి రంగారావు విశేషమైన కృషి కూడా దాగి ఉండటం గమనార్హం. నిరంతర అక్షర శ్రామికుడీయన. మినీ కవితాభ్యుదయం కోసం శ్రమించిన వారు. "బండెడు చెత్త కంటె ఒక్క మినీ కవిత గొప్పది" అని ప్రశంసించారు మహాకవి శ్రీశ్రీ. నిజమే మరి. ఉబుసుపోక కవిత్వం రాసే రోజులు కావివి. సమాజం చైతన్యవంతం కావాలని కోరుకునే రోజులు. మినీ కవిత లక్షణాల గురించి చెబుతూ, "క్లుప్తత, ఆప్తత, గుప్తత" అన్నారు డా॥దాశరథి. చెరబండ రాజైతే"ఈనాడు మినీ కవితలు హేండ్ గ్రెనేడ్స్‌లా పని చేస్తున్నాయి" అన్నారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥సి.నారాయణరెడ్డి కూడా గొప్ప నిర్వచనం చెప్పారు. మినీ కవిత ఆయుస్సు మెరుపంత, కాని అది ప్రసరిస్తుంది కాలమంత." అలాగే మినీ కవిత మీద ఎన్నో వ్యాసాలు రాసిన అద్దేపల్లి రామమోహనరావు ఒకచోట అంటారు-మినీ కవితకి క్లుప్తత జీవనాడి, ధ్వని ప్రాణనాడి", వేమన మాటల్ని కూడా మినీ కవిత్వానికి అన్వయించినప్పుడు "నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు, తళుకు బెళుకు రాలు తట్టెడేల" అనే పద్యం కనిపిస్తుంది.

సుమారు ఆరు వందల ఏళ్ల కిందట పాల్కురికి సోమనాథుడి అభిప్రాయం తీసుకున్నట్లయితే "అల్పాక్షరము లందు అనల్పార్థ రచన కన్పించుటయె కాదె కవి వివేకంబు" అనేది కూడా మినీ కవితా లక్షణాలకు అన్వయించుకోవచ్చు. "పిట్ట కొంచెం కూత ఘనం" అనే సామెత కూడా అన్వయించవచ్చు. మినీ కవిత స్వరూపం గురించి చెప్పుకోవలసి వస్తే, సాధారణంగా 12 పంక్తుల లోపు ఉండే కవితల్ని, మినీ కవితలు అనడం పరిపాటి. అయినప్పటికీ కేవలం నాలుగైదు పంక్తులలో మినీ కవితలు రాయటం ఎక్కువగా జరుగుతూ ఉంది. ఒక సామాజిక ప్రయోజనం కూడా యిమిడి ఉండాలి. ఎవరెన్ని రీతులలో చెప్పినా, ముఖ్యంగా పదునైన భావాన్ని గుప్తంగా ఉంచి, మెత్తగా హృదయానికి హత్తుకునే విధంగా క్లుప్తత కలిగి, పాఠకుడి మదిలో ఆలోచన రేకెత్తించాలి. అదీ మినీ కవిత. చూడండి- "నరాల బిగువు/ కరాల సత్తువ/ వెరసి శ్రామిక వాదం/ శ్రీశ్రీ నినాదం".

ఆధునిక తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడ, దగ్గరి నుండి సామాజిక స్పృహ లక్ష్యంగా కవిత్వం వస్తున్నట్లు చెప్పినా, అంతకు ముందే కవిత్వంలో ఆ ఛాయలు కనిపిస్తాయి. 17 వ శతాబ్దిలో వేమన నోటివెంట వెలువడిన సాహిత్యంలో ప్రతీ పద్యాన్ని ఒక మినీ కవితగా భావించవచ్చును.

నేటి మినీ కవితలు వేమన పద్యాలు లాగే క్లుప్తత, గుప్తత కలిగి ఉండటం గమనిస్తాం. పండిత, పామర జన రంజకమైన పదాలతో పుట్టి, నిండుగా జాతికి వెలుగు నిచ్చే జీవన పుష్పాలు వేమన పద్యాలు. అవి కాంతి పుంజాలు. పుట్టు గుడ్డికి అమర్చిన జ్ఞాన నేత్రాలు. వేమన కవిత్వం గురించి కూడా నాలుగు మాటలు చెప్పుకోవాల్సి ఉంది. ఆయన ప్రతి పద్యంలోను స్ఫూర్తి ప్రదమైన భావం, ధ్వని గర్భితంగా ఉంటుంది. వేమన పద్యాన్ని చదువుతా ఉంటే, ఆనందం మదిని నింపి, నిజాలు ఆవేశమై, పాఠకుడిని ఆలోచనలో ముంచేస్తాయి.

వేమన కవిత్వం ఆసక్తిదాయకంగా ఉంటుంది. ఆర్థిక అసమానతలు, రాజకీయ, సాంఘిక సంక్షోభాలు ఆనాడు ఉన్న కారణంగా వ్యవస్థ రోగగ్రస్తమై, సంస్కరించవలసిన పరిస్థితులు ఉన్నాయి. నేటి పరిస్థితి కూడా యించుమించు అదే. ఆటవెలదిని ఆయుధంగా చేపట్టి, వ్యవస్థలోని దుర్మార్గాల మీద విరుచుకుపడ్డారు.

మినీ కవిత అంటే వేమన పద్యాల్లాగుండాలి అన్న నానుడి లోకంలో ఉంది. అటువంటి వేమన కవితాశక్తిని గూర్చి చెబుతూ ఎల్లోరా ఇలా అంటారు. "ప్రజా కవి వేమనను/ యోగిని చేసి బట్ట తీసేశారట!/ తన పద్యాలనే వలువలుగా/ అల్లి కప్పుకున్నాడట!" ఇక డా.సి.నారాయణరెడ్డి కూడ తన 'భూమిక' లో వేమన కవిత్వ లక్షణాలు గురించి ప్రశంసిస్తూ యిలా అన్నారు. "నిగమ పాండితి నెత్తికెక్కక/ అగమ సాహితి బండ్ల కెత్తక/ లోక వృత్తం లోతు ముట్టిన/ ఓ కవీ! నీ వెవరవో!"

వేమనంటే ఈ సమాజానికి ఆరాధ్యం. ఆయన నోటి వెంట వచ్చిన ప్రతి మాటనీ ఉపయోగించుకొంటుందీ సమాజం. నీతిని బోధించేటప్పుడో, హేళన చేసేటప్పుడో, సామెతలల్లేటప్పుడో, ఎన్నో రూపాలుగా ఈ సమాజంతో కలిసి జీవిస్తున్న అక్షరాలు వేమనవి. డా.సి.నారాయణరెడ్డి ఏమన్నారో చూడండి. "సామెతలు గిలకొట్టినావో/ జాతి నుండి చేపట్టినావో/ పలుకులా అవి? కావు నడిచే ప్రాణ దీపికలే" అయితే వేమన పద్యాల్ని పోలిన మినీ కవితలు తెలుగు కవిత్వంలో కనిపిస్తాయి. వాటిలో మచ్చుకు కొన్నింటిని చూద్దాం. నాటికీ, నేటికీ అత్యంత ప్రాచుర్యంలో ఉన్న వేమన పద్యం ఒకటుంది. మనిషి చేత బొమ్మగా మలచబడి, మరొక మనిషి చేత గుడిలో ప్రతిష్ఠించిన రాతి బొమ్మకు, అడగనిదే నైవేద్యాలు సమర్పించే నాటి వ్యవస్థ స్వరూపాన్ని మన ముందున్న పద్యం- "రాతి బొమ్మకేల రంగైన వలువలు? / గుళ్లు గోపురములు, కుంభములును/ కూడు గుడ్డ తాను కోరునా దేవుడు?"/ అంటాడు. ఈ పద్యాన్నే 'మూర్ఖుల కరుణ' అనే మినీ కవిత ద్వారా మన ముందుంచారు కందెపు సుధాకర్. "తినలేని దేవునికి / ఎనలేని నైవేద్యాలు/ తినలేని వానికి/ ఆకలి, ఆవేదనలు".

ఇతరులకి ఉపయోగపడగలిగేది, సత్ఫలితాన్నివ్వ గలిగేది కొద్ది మాత్రమే అయినా సరిపోతుంది. ఇది సత్యం. నిరర్థకమైంది. ఎంతుంటే మాత్రం ప్రయోజనమేముంది! దీనినే వేమన మాటల్లో- "గంగి గోవు పాలు గరిటెడైన చాలు/ కడవడైన నేని ఖరము పాలు" అంటాడు. శ్రీ జంగా కలం నుండి పుట్టిన 'కిరణం' కవితను పరిశీలిస్తే, నేటి సమాజంలోని అనుభవాల నుండి రూపుదిద్దుకున్న ఈ కవిత వేమన అభిప్రాయంతో ఏకీభవిస్తుంది. "చీకటి గర్భంలో/ చిక్కుకుపోయే కంటే/ సూర్య గోళంలో/ ఒక్క కిరణమవడం మేలు".

స్త్రీ మీద, ధనం మీద ఆశ లేనివాడు ఈ భూమ్మీద అరుదు. ఆ సత్యాన్ని జంకు లేకుండా ఆనాడు వేమన చెప్పిన ఒక వజ్రపు తునక వంటి పద్యాన్ని చూద్దాం. "కన్నె మీదయాస/ కనకంబు పైనాస/ లేనివాడు పుడమి లేనివాడు/ కలిగె నేనివాడు కానంబడడయా" ఇటువంటి గొప్ప భావాన్ని మనిషికి హెచ్చరికగా, తెగింపు అనే మినీ కవితలో ఎం.రామశర్మ చెప్పారు. "ఓ మనిషీ! ఓ మనిషీ!/ వలువలు కోసం వనిత కోసం/ వలపు కోసం పిలుపు కోసం/ ప్రతి నిత్యం మాయ చేస్తున్నావు" చిన్ని కుర్రాడు మొదలు పండు ముసలి వరకు అందరి నోట అవలీలగా వినిపించే పద్య రత్నం, ఆనాటి వ్యవస్థ గుట్టు విప్పిన మంత్రం. "మేడిపండు జూడ మేలిమై యుండును/ పొట్ట విచ్చి జూడ బురుగులుండు"/ వేమన ఆనాటి రాజకీయ, సామాజిక పరిస్థితులను బాగా పరిశీలించి, అనుభవంతో చెప్పిన పద్యమిది. ఆ జాడలు డా.సి.నా.రె. కవితలో "ఏం మనుషులు మీరు/ తేనె పూసిన కత్తులు/ పైకి పత్తి విత్తులు/ లోపల విషపు తిత్తులు". ఇవన్నీ ఒకదానితో ఒకటి భావ సారూప్యం గల్గిన కవితలు. ఈ విధంగా వేమన కవిత్వ జాడల్ని నేటి మినీ కవితల్లో అనేకం గమనించగలం. అంతేకాదు, మినీ కవిత్వానికి వేమన పద్యాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని నా అభిప్రాయం.

ఈ మధ్య కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిన నానీ, నానో, రెక్కలు వంటి ప్రక్రియలన్నీ మినీ కవిత్వంలోని భాగమే. డా.రావి రంగారావు, డా.అద్దేపల్లి, కొల్లూరి, జోశ్యభట్ల మొదలైనవారు, నాలుగు దశాబ్దాల కిందటే మినీ కవిత్వాన్ని ప్రోత్సహించిన విషయం మనకి తెలుసు. ఆధునిక తెలుగు సాహిత్యంలో మినీ కవిత్వంకున్న స్థానం గొప్పది. చాలామంది కవులు వందలాదిగా మినీ కవితా సంపుటాల్ని వెలువరించిన సంగతి మన మెరుగుదుం. నేటికీ సాహిత్య పత్రికలు మినీ కవితల్ని ప్రోత్సహిస్తున్నందు వల్ల మినీ కవిత చిరంజీవి.

ఓ...కవీ !!

కలిమి కౌగిట కలవరించి
కవితలల్లే ఓ కవీ
వెతలుతప్ప కళలు మాకు
కలలనైనా రానివీ!!

వెన్నెలెంతగ వేడుకైనా
చూడనివ్వదు క్షుధాజ్వాల
తారాతోరణమెదుట ఉన్నా
కాననివ్వదు కడుపుగోల.

దోపిడీ దౌర్జన్యకాండలు
ధనికస్వామ్యపు తత్వము
వారి పాదాలొత్తుతావు
ఏల మాకు నీ కవిత్వము!!

పలికే తీరికలేదు నేస్తం
పూలబాలలు పిలిచినా
సమయమేదీ రంగురంగుల
సీతాకోకలు వలచినా.

చెమటచుక్కను అమ్ముకోనిదే
క్షణం గడవదు పేదబతుకు
కటిక నిజమిది కష్టంచేయక
కవీ దొరకదు ఒక్క మెతుకు!!

ఎంత ఇష్టమో పూరిగుడిసెలు
ఇనుపగజ్జెలకాళ్ళకి
ఎందుకో అగుపించము ఆ
సిరుల తల్లి కళ్ళకి

గతుకుబతుకుల వెతలబాటిది
మెతుకుకతకగ వెతుకులాటిది
చితికిచతికిలబడిన చితుకుల
కతల కలతల కరువు పాటిది!!

మాకు తప్పని నిత్యకృత్యము
మట్టితో సహచర్యము
కళ్ళముందే జరుగుతున్నది
చెమటగింజల చౌర్యము.

తీరికేదీ నిమిషము తిల
కించ ప్రకృతి అందము
ఏదినేస్తంవిరామం? మా
కెక్కడుందానందము?!!

కులాసాలను కోరుకున్నా
కాలమా అది ఒప్పదు
బతుకుకోసం ప్రతి క్షణము
పోరుచెయ్యక తప్పదు

నీకులాగా మాకు రాతిరి
అందముగ తెల్లారదు
నీకులా మా క్షుదానలము
హాయిగా చల్లారదు!!

కమ్మతెమ్మెర, కలవపువ్వులు
తుమ్మెదలు, తూనీగలు..
మీకే గానీ, మమ్మువదలవు
దోమలూ జోరీగలు

అందాలున్నవి అణువుఅణువున
అద్భుతాలే సృష్టిలో
అనుభవానికి రావు మాకవి
పడవుసుమి మా దృష్టిలో!!

మనిషిమనిషికి నడుమ తెరలు
నిమిషనిమిషము పెరిగే ధరలు
అడుగుఅడుగున బడుగుజనముల
శ్రమలుదోచిన సిరులదొరలు

ఇంతవేదనలోన అందా
లెట్లు కనగలమో కవీ
ప్రకృతి సౌందర్య వర్ణన
వినేదెట్లా ప్రియకవీ?!!

కాలమును కదిలించునేది
కష్టజీవుల స్వేదమే
ఉన్నదొకటే అందమది
జీవన సౌందర్యమే.

రేపుమాపుల రూపులున్నవి
రైతు నడిచే దారిలో
ప్రపంచానికి పిలుపు ఉన్నది
కార్మికుల రణభేరిలో!!

గంటేడ గౌరునాయుడు

వాలిన మబ్బులు

ఒకవైపు నల్ల మబ్బులు
మరోవైపు నీలి రంగులు
ఆకాశం నేలకు దిగి
ద్విగుణీకృత దీపంలా ఉంది

కరిమబ్బు కొసరి కొసరి
చినుకుల్ని మీటుతుంటే
ముగ్ధ మనోహర వన్నెలు
విచ్చుకొంటూ ఊరిస్తున్నాయి

పల్లె పచ్చని కలల్ని కంటూ
నీటి ఊయలపై తేలుతూ
త్రుళ్ళింతల తలపుల్ని మోస్తోంది

వాన రాగం వయ్యారాలు పోతూ
ప్రకృతి, ఆకృతుల అధ్యాయం
ఇప్పుడే మొదలైంది

వాలిన మబ్బులు
కర్షకుని శ్రమ సుద్దుల్ని వింటూ
రైతు పచ్చని పంటల కలల్ని
పావనం చేస్తున్నాయి...!

మహబూబ్ బాషా చిల్లెం
9502000415

సమకాలీన అంశాల 'ఆగ్రహి'

ఖమ్మం కలం డాక్టరు నీలిమ తాటికొండాల కవితాసంపుటి ఆగ్రహిలోని కవితలు పాఠకులను చదివించగలిగే విధంగా వుండి ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉన్నాయి. 'నెత్తురు చిమ్మిన బీభత్స పెత్తనాల దౌర్జన్యానికి శాంతపు ఉగ్గుపట్టిన జోలపాట నీలిమ" ను నేనంటూ నేను నీలిమ అనే కవితలో తనను తాను పరిచయం చేసుకున్న తీరు కవిత్వానికి తానొక చిరునామాగా తీర్చిదిద్దారు. "స్వీయదహన గీతాగ్నిలో చమురుదాహాన్ని వత్తికి నేర్పిన దారిదీప నీలిమనంటూ తనలోని జ్వాలను అక్షరీకరించారు. మృగభూమి కవితలో కదిలించిన సమకాలీన అంశాల క్రోడీకరణ కనిపించింది.



బతకడానికి కాస్త మరణం కావాలి కవితలో స్వేచ్ఛ కోసం పరితపిస్తూ "చివరకు అణచిపెట్టుకున్న అతి బలహీనుడి పెనుకేకలో అదో చోటు వెతుక్కోవాలి" అనే వాణి ఎంతో బలమైనది. 'నువ్వులేక' కవితలో నిరీక్షణలోని ఆకతాయితనాన్ని తనదైన శైలిలో పండిస్తూ బేగొచ్చెయ్ అబ్బాయ్ అంటూ అమాయకంగా పలికించిన వైనం బుంగమూతి ముద్దబంతిలా కొత్తగా వుంది. 'మాకొక ఆయుధం కావాలి' అనే కవిత లో పురుషాధిక్య సమాజాన్ని తెగ నరికే క్రమంలో "మగాధిపతులే దరాధిపతులై చేసే ఈ మృగరాజ్యంలో" అంటూ విరుచుకుపడి ఆయుధాన్ని ముగింపులో తక్షణ న్యాయం మా ఆయుధం అనటంతో కవిత ఆద్యంతం ఆవేశంతో సాగి చివరకు చప్ప బడిందని చెప్పవచ్చు. అమ్మంటే అన్నీ అనే కవితలో అమ్మ బిడ్డకోసం తన పాత్రలను ఎలా మార్చుకుంటుందో లేదా రూపు దిద్దుకుంటుందో సున్నితంగా సరళంగా చాలా బాగా చెప్పారు."నేననుకోలేదు ఓనమాలు కూడా రాని నేను కథలల్లుతానని నీ లాల కోసం" ఎంతటి విభిన్నం పదాలల్లికలో.

నువ్వు నేను కవితలో అతడు ఆమెను విభజిస్తూ నువ్వో ఆధిపత్యం నేనో అధీనత్వం అని ఖరాఖండిగా సెలవిచ్చారు. స్త్రీలచరిత్రలు కవితలో శ్రీశ్రీ గారి ఏ దేశ చరిత్ర చూసినా...శైలి బహిరంగంగా కనిపించింది. నేననుకోలేదు కవితలో వేళ్లానుకున్న ఫాసిజంపై సరికొత్తగా తిరుగుబాటును వ్యక్తీకరించారు. "నేననుకోలేదు చిన్నపుడు నేను ముస్సోలినిని, హిట్లర్ మరో రూపంలో జన్మిస్తారని" కళ్ళముందు జరుగుతున్న దారుణాలకు చలించిన కలం గుండా జాలువారిన అక్షరాలవి. "నిజానికి...నిజానికి...యుద్ధం మరుపు కాదు అసలు సిసలు రాజనీతి" అని కవయిత్రి యుద్ధాన్ని కోరుకోలేదు.. శాంతి చర్చలు జరగట్లేవని చింతించారు. ఆక్రమణ కవితలో నీవే అంతా ఆక్రమించాక ఇంకేముంది నేనంటే నువ్వే ఇక అని బాధను మెలిపెట్టేలా విశదీకరించారు. "మేనే నాది ఏలేది నువ్వే! గమనమే నాది గమ్యం నీదే" అని అశక్తతను వెలిబుచ్చారు. నీలిమ తన కవితల్లో ఇంకొంత వైవిధ్యాన్ని మేళవిస్తూ అనుకరణ కనబడనీయ కుండా మరికొంత జాగ్రత్తగా కవితా వస్తువును ఎంపిక చేసుకుంటే మరింత విభిన్నత కనిపించేది. ఈ సంపుటి 100 పేజీలలోపే వుండటం మంచినిర్ణయం. ప్రతులకు రచయిత్రిని, పాలపిట్ట ప్రచురణలు, అమెజాన్‌ను సంప్రదించవచ్చు.

- గిరి ప్రసాద్ చెలమల్లు, 9493388201

ఆయనకు అక్షరమే వ్యాపకం, ఊపిరి

గ్రంథ సమీక్ష

బలవంతుడి న్యాయం - బోడి గుండు - నవ్వు వాసన. పుస్తకం కవర్ పేజీపై డాక్టర్ దేవరాజు మహారాజు ఫోటో మీద గుడిసె గుండెతో మొదలు అతని రచనల పేర్లన్నీ వేసినట్టున్నారు. మొదట్లో చెప్పిన మూడు మాటలు మహారాజు పెదాలమీద ఉన్నాయి.



డా॥దేవరాజు మహారాజు సప్తతి
(దేవరాజు మహారాజు సప్తతి పూర్తి అభినందన సంచిక)
పేజీలు: 204, వెల: రూ.200/-
ప్రతులకు:
జీవన ప్రచురణలు, శేరిలింగంపల్లి, హైదరాబాద్
అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలో లభించును.

డాక్టర్ దేవరాజు మహారాజు అన్నది ఒక అరుదైన పేరు. ఆ వ్యక్తి కూడా అంతకన్నా అరుదైన మనిషి. ఆయన చాలా కాలంగా కవిగా, కథకుడుగా, మరెన్నో రకాల ప్రక్రియల రచయితగా బాగా పేరు తెచ్చుకున్న మనిషి. ఒకప్పుడు తెలంగాణ భాషలో కవిత, కథ అంటే అందరికన్నా ముందు నిలిచిన రచయిత డాక్టర్ మహారాజు. ఆయనకు 70 సంవత్సరాలు నిండాయి. ఆ తరువాత కొంత కాలం గడిచింది కూడా. ఈలోగా సాహితీ ప్రియులు, మిత్రులు, అభిమానులు కలిసి వెలువరించిన ఈ సంచికలో ప్రముఖులిద్దరూ మహారాజు గురించి రాశారు. మొత్తం 200 పేజీల పుస్తకం వచ్చింది. అంటే ఈ రచయితకు గల ఆదరణ గురించి మనకు సులభంగానే అర్థమవుతుంది.

వ్యక్తిగా మహారాజు గురించి, అతని విభిన్న రచనలు వాటిలో వైవిధ్యం గురించి ఈ పుస్తకం చదివి ఉదాహరణ పద్ధతిలో తెలుసుకునే అవకాశం పాఠకులకు దొరికింది. ఇందులో మొదట వివిధ అంశాలను గురించిన వ్యాసాలు ఉన్నాయి. పేరు గలవారంతా మహారాజు గురించి రకరకాల విషయాలు రాశారు. వైజ్ఞానిక సృజనకారుడు అనే వ్యాసంలో హనుమంత రావు రాసిన వివరాలు వ్యక్తిగా మహారాజు గురించి చెబుతాయి. అలాగే పుస్తకంలో మరికొన్ని చోట్ల కూడా అతని జీవిత విశేషాలు ఇచ్చారు. నిజంగానే ఇంత బాగా రాసిన రచయిత ఎక్కడి వారు ఎలాంటి వారు తెలుసుకోవాలని ఎవరికైనా కోరిక కలగడం సాధారణం. అందుకు సమాధానం ఈ వ్యాసాలు, మరిన్ని రచనలలో దొరుకుతుంది.

ఆ తరువాత వివిధ సందర్భాలలో మహారాజుతో జరిగిన ఇంటర్వ్యూలు పొందుపరిచారు. వీటితో రచయిత గురించి మరెన్నో విషయాలు తెలుస్తాయి. మహారాజు చాలా పుస్తకాలు రాశారు. వాటిలో కొన్నింటి గురించి వచ్చిన కొన్ని సమీక్షలను ఆ తరువాత ఈ పుస్తకంలో చదవవచ్చు. మరింత ముందుకు వెళితే కవితల రూపంలో కొంతమంది రాసిన అభినందనలు ఉన్నాయి. ఆ తరువాత వరుస పెట్టి మిత్రులు, శ్రేయోభిలాషులు, సాహిత్యకారులు అందజేసిన అభినందనలు క్రమం మరెన్నో విషయాలను మన ముందు ఉంచుతుంది.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన సందర్భంగా వార్తలు విశేషాలను కూడా పుస్తకంలో వేయడం ఆసక్తికరంగా ఉంది. అలాగే మరికొన్ని రచనలు కూడా పుస్తకంలో అందుబాటులో ఉన్నాయి.

డాక్టర్ దేవరాజు మహారాజు డాక్టరేట్ సాహిత్యంలో కాదు. అతను సిసలైన వైజ్ఞానికుడు వృక్షాలలోని మురిపురుగులను గురించి పరిశోధించి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. పరిశీలన అన్నది ఈ వ్యక్తి ముఖ్యలక్షణం అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.. పరిశీలకుడు కనుక పరిశోధనలోకి వెళ్ళాడు. ఆ తరువాత అతని పరిశీలన చక్కని వైజ్ఞానిక పద్ధతిలో సాగింది. రాసిన అన్ని రచనలలోనూ చెప్పకుండానే ఒక వైజ్ఞానిక దృక్పథం చోటు చేసుకున్నది. అది కథ కానీ, కవిత గానీ అందరిలాగా కాక అనుకోకుండానే అందులో వైజ్ఞానిక దృక్పథం తొంగిచూడడం ఒక గుర్తింపుగా నిలిచింది. పరిశోధనశాలలో విశ్లేషణలు చేసినట్టే ఈ రచయిత ప్రపంచంలోని మనుషులను, వారి స్వభావాలను విశ్లేషించి రకరకాల పద్ధతులతో రచనలు చేసినట్టు ఈ పుస్తకం చదివిన తరువాత సులభంగా అర్థమవుతుంది.

ఇక మరి ఇంత మన్నన పొందిన రచనలన్నీ చదవాలని అనిపించడం చాలా సాధారణమే. కనుక పుస్తకం చివరిలో మహారాజు రచనల పట్టికను చక్కగా పొందుపరిచారు. కవిత్వం, కథలు, బాలసాహిత్యం, సాహిత్య విశ్లేషణ, నాటికలు, సినిమా గురించిన కబుర్లు, అన్నింటిని మించి పాపులర్ సైన్స్ ఇవన్నీ రచయితలోని వైవిధ్యాన్ని కళ్ళకు కట్టి చూపిస్తాయి. మరి ఈ పుస్తకాలన్నీ అందుబాటులో ఉన్నాయా అన్న ప్రశ్న మిగులుతుంది. కొన్నైనా తప్పకుండా దొరుకుతూనే ఉంటాయి. కనుక చదివే వాళ్ళు వాటిని సంపాదించడానికి ప్రయత్నిస్తారు.

పుస్తకం వెనుక అట్ట లోపల, బయట బుద్ధుని విగ్రహాల ముందు దేవరాజు మహారాజు నిలిచి ఉన్న ఫోటోలు ఉన్నాయి. ఆ రెంటిలోనూ అతను చేతులు కట్టుకొని ఉన్నాడు. అంటే ఆ మనిషి తత్వం గురించి చాలా సులభంగా అర్థమవుతుంది. ఇక పుస్తకం నిండా రకరకాల సందర్భాలకు చెందిన ఫోటోలను చక్కగా ప్రచురించారు. ఆ సందర్భాలు జరగడం ఒక ఎత్తైతే, అన్నింటినీ గురించి ఫోటోలను అంత జాగ్రత్తగా దాచడం నిజంగా ఇక్కడ గమనించవలసిన విషయం. కవర్ పేజీ లోపల వైపు చిన్ననాటి నుంచి ప్రస్తుతం వరకు మహారాజు ఫోటోలను కొలాజ్ గా వేయడం చాలా బాగుంది. పుస్తకాల కవర్ పేజీల బొమ్మలు కూడా అక్కడక్కడ కనిపిస్తాయి.

రచయితకు పేరు రావడం ఒక ఎత్తు. అతనికి అంతమంది అభిమానులు ఉండడం మరొక ఎత్తు. వారందరూ కలిసి ఇంత చక్కని పుస్తకం తీసుకురావడం అన్నిటికన్నా మించిన ఎత్తు.

అక్షరం ఆయన ఊపిరి, అక్షరం ఆయన వ్యాపకం, అక్షరం ఆయన ఆయువు అన్న మాటలు మహారాజు సతీమణి కృష్ణ కుమారి రాసిన కవితాత్మక అభినందనలు ఉంది. అందరూ రాసింది ఒకే అయితే ఆమె రాసినది మరొక ఎత్తు. మొత్తానికి ఒక మంచి రచయిత గురించి చాలా మంచి విషయాలు ఒకచోట చేర్చిన సంపాదక వర్గానికి అభినందనలు చెప్పకుండా ఉండలేము.

కె.బి. గోపాలం, 9849062055

బెంగాల్ మంత్రి, ఎమ్మెల్యే ఇళ్లపై సీబీఐ దాడులు

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ మంత్రి, కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్, టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రా ఇళ్లపై సీబీఐ దాడులు చేసింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు కేంద్ర బలగాలతో కూడిన ఆరుగురు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అధికారుల బృందం హకీమ్ నివాసంలోకి ప్రవేశించింది. ప్రాంగణం చుట్టూ బారికేడ్లు వేగంగా ఏర్పాటు చేశారు. బయటివారి ప్రవేశాన్ని పూర్తిగా నిరోధించారు. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత మదన్ మిత్రా నివాసంలో సీబీఐ సోదాలు నిర్వహించింది. మిత్రా కమర్హతి ఎమ్మెల్యే. కమర్‌హతి మునిసిపాలిటీ, ఇతరులతో పాటు ప్రస్తుతం అవినీతి వ్యవహారాలపై విచారణ జరుగుతోంది. తాజాగా మరో అవినీతి కేసులో ఆహార మంత్రి రథిన్ ఘోష్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహించింది. పాఠశాల ఉపాధ్యాయుల నియామకంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అరెస్టయిన ఏజెంట్ అయాన్ సిల్ కార్యాలయాన్ని పరిశీలించినప్పుడు విస్తృత నియామక అక్రమాలకు సంబంధించిన గణనీయమైన సమాచారాన్ని సీబీఐ బయటపెట్టిందని పేర్కొంది. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ ఆదేశాల మేరకు అధికారిక ఎఫ్‌ఐఆర్ నమోదయింది. ఈ సంఘటనపై అధికారిక దర్యాప్తు ప్రారంభమయ్యింది. ఈ విస్తృతమైన విచారణ వివిధ మునిసిపాలిటీలలో అక్రమ నియామకాలు, ఉపాధ్యాయ నియామకాలు, పశువులు, బొగ్గు, ఇసుక అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలతో సహా వివిధ అవినీతి ఆరోపణలను కలిగి ఉంది. ఈ చర్యలు టీఎంసీ హయాంలో జరిగాయని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. హకీమ్ ప్రమేయంపై సీబీఐ దర్యాప్తు, ఈడీ అందించిన ఇంటెలిజెన్స్ ఆధారంగా నివేదించబడింది. ఇది పట్టణాభివృద్ధి శాఖలో అవినీతిపై చురుకుగా దర్యాప్తు చేసింది. ఇప్పటికే బహుళ మున్సిపాలిటీలకు చెందిన సీనియర్ ఆఫీస్ బేరర్ల ఆస్తులపై దాడి చేసింది. టీఎంసీ కేబినెట్‌లో ప్రముఖుడిగా, పార్టీ కీలక నేతగా ఉన్న హకీమ్ చాలా కాలంగా ప్రజా పనులు, పట్టణాభివృద్ధి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఇదిలాఉండగా, అలీపుర్‌దూర్ కోఆపరేటివ్ బ్యాంక్‌కు సంబంధించి ఆరోపణల నేపథ్యంలో సీబీఐ ప్రస్తుతం అలీపుర్‌దూర్‌లోని 21 వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తోంది.

సీబీఐ దాడులు... మా ఆందోళన నుంచి దృష్టి మరల్చేందుకే... : టీఎంసీ

పశ్చిమ బెంగాల్‌లోని రాష్ట్ర మంత్రి, కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ నివాసంతో సహా అనేక ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుంచి సీబీఐ జరిపిన సమాంతర దాడులు తృణమూల్ కాంగ్రెస్ చేపట్టిన రాజ్‌భవన్ ఆందోళన నుంచి దృష్టిని మరల్చే ప్రయత్నమని రాష్ట్ర అధికార పార్టీ నాయకత్వం పేర్కొంది. పశ్చిమ బెంగాల్‌లో కోట్లాది రూపాయల నగదు, మున్సిపాలిటీల ఉద్యోగాల కేసుకు సంబంధించి సీబీఐ దాడులు జరుగుతుండగా, తృణమూల్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ లోక్‌సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ నాయకత్వంలో బైఠాయించారు. సెంట్రల్ కోల్‌కతాలోని గవర్నర్ హౌస్ గురువారం సాయంత్రం నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల కింద పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి కేంద్ర బకాయిలను విడుదల చేయడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పార్టీ ఆరోపించింది. 'అభిషేక్ బెనర్జీ నేతృత్వంలోని ఆందోళన విజయవంతమైంది. అందువల్ల బీజేపీ విపరీతమైన ఒత్తిడిలో ఉంది. గవర్నర్ కోల్‌కతాకు వచ్చి నిస్సహాయంగా తప్పించుకుంటున్నారు. అందువల్ల గవర్నర్ హౌస్ ముందు ఆందోళన నుంచి దృష్టిని మరల్చడానికి, బీజేపీ మళ్లీ కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పింది. దర్యాప్తు సంస్థలు బీజేపీకి ఆత్మరక్షణ మాత్రమే. కానీ ఇలాంటి వాటితో తృణమూల్ కాంగ్రెస్‌ను అణచివేయలేరు' అని తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ అన్నారు. కాగా, తృణమూల్ కాంగ్రెస్ కూడా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక సందేశాన్ని కూడా విడుదల చేసింది. ఎంతటి రాజకీయ ప్రతీకారానికి తమ నాయకత్వానికి తలవంచదని స్పష్టం చేసింది. 'బీజేపీ జమీందార్లు, మా సంకల్పం మీకు కనిపిస్తోందా? ఇది గతంలో కంటే ప్రకాశవంతంగా వెలిగిపోతోంది. రాజ్‌భవన్‌లో జరుగుతున్న ఈ నాల్గవ రోజు ధర్నాలో మా సహనం నశించలేదు. మీ రాజకీయ ప్రతీకార ధోరణి మమ్మల్ని అడ్డుకోలేదు. బెంగాల్ ప్రజలకు రావల్సిన బకాయిలు వచ్చేవరకు ఒక్క అంగుళం కూడా వెనక్కి తగ్గము' అని పేర్కొంది.

మణిపూర్ మంత్రి నివాసం వద్ద పేలుడు

ఇద్దరికి గాయాలు

ఇంఫాల్ : ఇంఫాల్ తూర్పు జిల్లాలో మణిపూర్ మంత్రి ఖేమ్‌చంద్ యుమ్నామ్ నివాసం సమీపంలో ఒక హ్యాండ్ గ్రెనేడ్ పేలుడులో సీఆర్‌పీఎఫ్ దళ సభ్యుడు సహా ఇద్దరు గాయపడినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ ఘటన శనివారం రాత్రి దాదాపు 10 గంటల సమయంలో యుమ్నామ్ లైకై వద్ద జరిగింది. మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు గ్రెనేడ్ విసిరారు. మంత్రి నివాసం ప్రధాన గేటు నుంచి కొన్ని మీటర్లలో పేలుడు సంభవించిందని పోలీసులు చెప్పారు. గాయపడిన వారిలో పశ్చిమ బెంగాల్ నివాసి దినేశ్ చంద్ర దాస్ అనే సీఆర్‌పీఎఫ్ దళ సభ్యుడి చేతికి గాయాలయ్యాయి. మరొక మహిళ కూడా గాయపడ్డారు. ఆమె కుడి కాలుకి గాయాలయ్యాయి. యుమ్నామ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి. పేలుడు జరిగిన ప్రాంతాన్ని ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ సందర్శించి దాడిని ఖండించారు. మణిపూర్ ప్రభుత్వం తన ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలు, సంస్థల పేర్లను మార్చడాన్ని వ్యతిరేకిస్తూ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అటువంటి చర్య వర్గాల మధ్య వైరుధ్యాన్ని సృష్టించి, ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తుందని వాదించింది. ఎవరైనా ఆదేశాన్ని ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత చట్టాల ప్రకారం విచారణ చేయడం జరుగుతుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా జిల్లాలు, సబ్ డివిజన్‌లు, స్థలాలు, సంస్థలు, చిరునామాల పేర్లు మార్చే ఉద్దేశపూర్వక చర్యను ఎవరూ చేయకూడదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వినీత్ జోషి ఉత్తర్వులు జారీ చేశారు.

ఇజ్రాయిల్‌లో బాలీవుడ్ నటి సుస్రిత్ సురక్షితం

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్ లో తప్పిపోయిన బాలీవుడ్ నటి సుస్రిత్ భరూచా ఆచూకీ లభించింది. ఆమెను టీమ్ ఎట్టకేలకు సంప్రదించగలిగింది. తరువాత టీమ్ ద్వారా హీరోయిన్ అక్కడి ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. మరి కొన్ని గంటల్లో భారత్ కు రానున్నారు. ఇజ్రాయెల్ లో చిక్కుకుపోయి, తన టీమ్ తో సంబంధాలు కోల్పోయిన బాలీవుడ్ నటి నుస్రత్ భరూచా సురక్షితంగా ఉన్నారు. ఎట్టకేలకు ఆమెను టీమ్ సంప్రదించగలిగింది. హైఫా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో పాల్గొనేందుకు ఆమె ఇటీవల ఇజ్రాయెల్ వెళ్లారు. అయితే ఆ దేశానికీ, పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ కు మధ్య నెలకొన్ని ఉద్రిక్త పరిస్థితుల వల్ల ఆమె తప్పిపోయింది. ఆమె టీమ్ తో కూడా కమ్యూనికేషన్ తెగిపోవడంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. ఆమెను కనిబెట్టేందుకు టీమ్ తీవ్రంగా ప్రయత్నించింది. చివరికి కమ్యూనికేషన్ జరగడంతో ఆమె ఇప్పుడు ఇజ్రాయిల్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అయితే నేరుగా భారత్‌కు విమాన సర్వీసు అందుబాటులో లేకపోవడంతో కనెక్టింగ్ ఫ్లైట్ ద్వారా స్వదేశానికి చేరుకోనున్నారు. మరి కొన్ని గంటల్లోనే ఆమె భారత్ కు తిరిగి రానున్నారు.

సత్యేందర్ జైన్ బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ మంత్రి సత్యేందర్ కుమార్ జైన్ బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టనుంది. సత్యేందర్ జైన్, సహ నిందితుడు అంకుష్ జైన్ పిటిషన్‌పై జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ బేల ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారణను కొనసాగించనుంది. సెప్టెంబరు 25న సుప్రీంకోర్టు అక్టోబరు 9 వరకు జైన్‌కు మధ్యంతర బెయిల్‌ను పొడిగించింది. విచారణను పెండింగ్‌లో ఉంచి, కేసు విచారణను ఆలస్యం చేయడానికి యత్నించవద్దని ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం జైన్‌ను కోరింది. తన బెయిల్ పిటిషన్ సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ట్రయల్ కోర్టులో విచారణను పదేపదే వాయిదా వేయాలని జైన్ కోరుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పేర్కొంది. ట్రయల్ కోర్టు నుంచి జైన్ 16 తేదీలను తీసుకున్నారని ఈడీ ఆరోపించింది. వెన్నెముక శస్త్రచికిత్స కోసం జైన్‌కు ఆరు వారాల పాటు మధ్యంతర బెయిల్‌ను మే 26న సుప్రీంకోర్టు మంజూరు చేసింది. ఒక పౌరుడికి తన స్వంత ఖర్చుతో ప్రైవేట్ ఆసుపత్రిలో తనకు నచ్చిన చికిత్స పొందే హక్కు ఉందని పేర్కొంది. సెప్టెంబర్ 12న ఈ కేసులో జైన్‌కు మధ్యంతర బెయిల్‌ను సెప్టెంబర్ 25 వరకు పొడిగించింది. జైన్ తనతో సంబంధం ఉన్న నాలుగు కంపెనీల ద్వారా మనీలాండరింగ్ చేశారన్న ఆరోపణలపై ఈడీ గత ఏడాది మే 30న ఆయన్ను అరెస్ట్ చేసింది. అవినీతి నిరోధక చట్టం కింద జైన్‌పై 2017లో నమోదైన సీబీఐ ఎఫ్‌ఐఆర్ ఆధారంగా జైన్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది. సీబీఐ నమోదు చేసిన కేసులో ట్రయల్ కోర్టు 2019 సెప్టెంబర్ 6న ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది.

బీజేపీ పాలిత రాష్ట్రాలను ఎందుకు వదిలేశారు?

'కులగణన'పై మోదీ మౌనాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : కుల గణన విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ ఆదివారం ప్రశ్నించింది. సామాజిక న్యాయం, హక్కులను నిర్ధారించడానికి బీజేపీ పాలిత రాష్ట్రాలు కుల గణన ఎందుకు నిర్వహించడం లేదని నిలదీసింది. అశోక్ గహ్లోత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజస్థాన్‌లో కులాల సర్వే నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసిన ఒక రోజు తర్వాత పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది. రాజస్థాన్‌లో భారత్ జోడో యాత్ర జరిగినప్పుడు రాహుల్ గాంధీ అనేక వర్గాల ప్రతినిధులను కలిశారని, ఆ సమయంలో ఓబీసీ ప్రతినిధులు ప్రత్యేకంగా కుల గణన డిమాండ్‌ను లేవనెత్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. 'రాహుల్ గాంధీ వారి మాటలను చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఇప్పుడు రాజస్థాన్ ప్రభుత్వం వారి మనోభావాలకు అనుగుణంగా కుల ఆధారిత సర్వేను నిర్వహించాలని నిర్ణయించింది. ఇది స్వాగతించదగిన చర్య' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హిందీలో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. 'ఇది ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల కోసం విధానాలను రూపొందించడంలో సహాయపడుతుంది. సామాజిక న్యాయం, వారి జనాభా ప్రకారం ప్రజలకు హక్కులు కల్పించడం కూడా చాలా ముఖ్యం' అని రాజస్థాన్ ప్రభుత్వ ఉత్తర్వులను పంచుకుంటూ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. కుల సర్వేపై రాజస్థాన్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కూడా ఆయన పంచుకున్నారు. బీజేపీ పాలిత ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి కార్యక్రమాలు ఎందుకు చేపట్టడం లేదని, కుల గణన విషయంలో ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారనేదే ప్రశ్న' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కులాల గణన కోసం కాంగ్రెస్ పట్టుబడుతోంది. దానిని ఎన్నికల అంశంగా మారుస్తోంది. దేశంలో బీహార్ తర్వాత కులాల సర్వే నిర్వహించనున్న రెండో రాష్ట్రంగా రాజస్థాన్ నిలవనుంది. రాజస్థాన్‌లో ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల షెడ్యూల్‌ను ఎప్పుడైనా ప్రకటించే అవకాశం ఉంది.

సిక్కిం వరదల్లో 56 మందిని రక్షించిన ఐటీబీపీ

77కి చేరిన మరణాలు

గ్యాంగ్‌టక్ : సిక్కిం ఉత్తర ప్రాంతం చుంగ్తాంగ్‌లో వరదలో చిక్కుకున్న 56 మందిని ఐటీబీపీ రక్షించింది. ఇది ఆకస్మిక వరదలో అత్యంత ప్రభావితమైన ప్రాంతాలలో ఒకటి అని ఐటీబీపీ ఆదివారం తెలిపింది. రక్షించబడిన వారిలో 52 మంది పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారని పీటీఐ తన నివేదికలో ఐటీబీపీ ప్రకటనను ఉటంకించింది. కాగా, వరదల్లో మరణించిన వారి సంఖ్య 77కు చేరినట్లు అధికార వర్గాలు ధ్రువీకరించాయి. 'మరో రెస్క్యూ ఆపరేషన్‌లో, ఉత్తర సిక్కింలోని చుంగ్తాంగ్‌లో ఐటీబీపీ సహాయక బృందం రోప్‌వే ద్వారా 56 మంది పౌరులను (52 మంది పురుషులు, నలుగురు మహిళలు) విజయవంతంగా రక్షించారు' అని ట్వీట్ చేసింది. వరదల్లో గల్లంతయిన 81 మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 30 మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు, సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ మండలి (ఎస్‌ఎస్‌డీఎంఏ) ప్రకారం, బుధవారం తెల్లవారుజామున మేఘ విస్ఫోటనం కారణంగా ఆకస్మిక వరద హిమాలయ రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో 41,870 మంది ప్రజలను ప్రభావితం చేసింది. ఇతర ప్రభావిత ప్రాంతాలుగా గ్యాంగ్‌టక్, ప్యాక్‌యాంగ్, నామ్చి ఉన్నాయి. కాగా, ప్యాక్‌యాంగ్‌లో 19 మరణాలు నమోదు కాగా, గ్యాంగ్‌టక్ జిల్లాలో ఆరు, మంగన్‌లో నాలుగు, నామ్చిలో ఒక మరణం సంభవించిందని ఎస్‌ఎస్‌డీఎంఏ తెలిపింది. సహాయక ఆపరేషన్‌లలో ప్రత్యేక రాడార్‌లు, డ్రోన్‌లు, సైనిక శునకాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు, వేర్వేరు ప్రాంతాల నుంచి 2,563 మందిని రక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 సహాయక శిబిరాల్లో 6,875 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఆకస్మిక వరదల్లో నాలుగు జిల్లాల్లో 1,320 గృహాలు ధ్వంసమవగా, 13 వంతెనలు కొట్టుకుపోయాయి. మంగన్ జిల్లాలోని లాచెన్, లాచుంగ్‌లలో చిక్కుకుపోయిన 3 వేల మందికి పైగా పర్యాటకులు సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. వరదల బారిన పడిన సిక్కిం రాష్ట్రంలో ఆదివారం నాటికి మొత్తం 77 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, సిక్కింలోని వివిధ ప్రాంతాలలో ఇప్పటివరకు మొత్తం 29 మృతదేహాలను వెలికితీసినట్లు రాష్ట్ర సహాయ కమిషనర్ అనిల్‌రాజ్ రాయ్ తెలిపారు. కాగా, వరదలపై ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్‌తో గ్యాంగ్‌టక్‌లోని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా ఆదివారం సమావేశమయ్యారు. సమావేశానంతరం సీఎం తమంగ్ మీడియాతో మాట్లాడుతూ వరదలతో అతలాకుతలమైన రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయన్నారు.

ఇస్రో నిత్యం సైబర్ దాడులను ఎదుర్కొంటోంది

చైర్మన్ సోమనాథ్

కొచ్చి: ఇస్రో ప్రతి రోజూ 100 సైబర్ దాడులకు గురవుతోందని ఆ సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. దానిని ఎదుర్కొనే పటిష్టమైన సైబర్ సెక్యూరిటీ నెట్ వర్క్ ఇస్రో కు ఉందని చెప్పారు. పెరిగిన టెక్నాలజీతో, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సైబర్ నేరగాళ్లు విసురుతున్న సవాళ్లను ఎదుర్కోవచ్చని అన్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతి రోజూ 100కు పైగా సైబర్ దాడులను ఎదుర్కొంటోందని ఆ సంస్థ చైర్మన్ ఎస్ సోమనాథ్ అన్నారు. కేరళలోని కొచ్చిలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సైబర్ కాన్ఫరెన్స్ 16వ ఎడిషన్ ముగింపు సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. కేరళ పోలీస్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ రీసెర్చ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ... అత్యాధునిక సాఫ్ట్ వేర్, చిప్ ఆధారిత హార్డ్ వేర్ ను ఉపయోగించే రాకెట్ టెక్నాలజీలు సైబర్ దాడులకు అవకాశం చాలా ఎక్కువగా ఉందన్నారు. ఇలాంటి దాడులను ఎదుర్కొనేందుకు పటిష్టమైన సైబర్ సెక్యూరిటీ నెట్ వర్క్ ఇస్రోకు ఉందని సోమనాథ్ స్పష్టం చేశారు.

సాఫ్ట్ వేర్ తో పాటు రాకెట్ల లోపల హార్డ్ వేర్ చిప్ ల భద్రతపై దృష్టి సారించి ఇస్రో వివిధ పరీక్షలతో ముందుకు వెళ్తోందని అన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఇప్పుడు అనేక ఉపగ్రహాలను సాఫ్ట్ వేర్ తో ఒకే సారి పర్యవేక్షించే పద్ధతి వచ్చిందని అన్నారు. ఇది ఈ రంగం వృద్ధిని సూచిస్తుందని చెప్పారు. కొవిడ్ సమయంలో మారుమూల ప్రాంతం నుంచి ప్రయోగాలు జరపడం సాధ్యమైందని, ఇది టెక్నాలజీ విజయానికి నిదర్శనమని అన్నారు. నావిగేషన్, మెయింటెనెన్స్ తదితరాల కోసం వివిధ రకాల ఉపగ్రహాలను రూపొందిస్తున్నట్లు ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. వీటితో పాటు సామాన్యుల దైనందిన జీవితానికి ఉపయోగపడే ఉపగ్రహాలు కూడా ఉన్నాయని అన్నారు. ఇవన్నీ వివిధ రకాల సాఫ్ట్ వేర్ల ద్వారా కంట్రోల్ అవుతాయని చెప్పారు. వీటన్నింటినీ రక్షించడానికి సైబర్ భద్రత చాలా ముఖ్యం అని స్పష్టం చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఒక వరమని, అదే సమయంలో అది ముప్పు అని సోమనాథ్ అన్నారు. అయితే అదే టెక్నాలజీతో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు విసురుతున్న సవాళ్లను ఎదుర్కోవచ్చని అన్నారు. ఆ దిశగా పరిశోధనలు, కృషి జరగాలన్నారు.

ఈ సమావేశానికి హాజరైన కేరళ రెవెన్యూ మంత్రి పి.రాజీవ్ మాట్లాడుతూ.. సైబర్ సెక్యూరిటీ గవర్నెన్స్ లో రాష్ట్రం రోల్ మోడల్ అని అన్నారు. సైబర్ రంగానికి తగిన భద్రతను రాష్ట్ర ప్రభుత్వం కల్పించగలదని తెలిపారు. సైబర్ రంగానికి తగిన భద్రత కల్పించే సామర్థ్యం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. కేరళలో డిజిటల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం ఈ రంగానికి అవసరమైన తోడ్పాటును అందిస్తోందని తెలిపారు.

వివిధ ప్రభుత్వరంగ బ్యాంకులకు ఈడీల నియామకం

న్యూఢిల్లీ: వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు(ఈడీ)గా 12 మంది జనరల్ మేనేజర్ల నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 12 మంది ఈడీల నియామకాలకు కేబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ ఆమోదం తెలిపిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర జనరల్ మేనేజర్ సంజయ్ రుద్రను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈడీగా నియమించారు. అదే బ్యాంకుకు చెందిన మరో జీఎం విజయ్‌కుమార్ ఎన్ కాంబ్లే యూకో బ్యాంక్ ఈడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అంతేకాకుండా, ప్రస్తుతం కెనరా బ్యాంక్‌లో చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఉన్న భవేంద్ర కుమార్ అదే బ్యాంకుకు ఈడీగా పదోన్నతి కల్పించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అలాగే పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ బిభు ప్రసాద్ మహాపాత్రను కూడా బ్యాంక్ ఈడీగా నియుక్తులయ్యారు. అయితే జనరల్ మేనేజర్ రవి మెహ్రా పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఇడిగా పదోన్నతి పొందారు. ఇక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ జనరల్ మేనేజర్ బ్రజేష్ కుమార్ సింగ్ మార్చిలో ఇండియన్ బ్యాంక్‌లో ఈడీగా చేరనున్నారు. అదే సమయంలో ఇండియన్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ రోహిత్ రిషి వచ్చే నెలలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఈడీగా బాధ్యతలు స్వీకరిస్తారు. ఇదిగాక బ్యాంక్ ఆఫ్ బరోడా ఈడీగా లాల్ సింగ్, ఇండియన్ బ్యాంక్‌గ ఈడీగా శివ్ బజరంగ్ సింగ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈడీగా మహేంద్ర దోహరే, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఈడీగా టి.ధనరాజ్‌ను నియమించడాన్ని ప్రభుత్వం ఆమోదించింది.

ఇజ్రాయిల్ ప్రజలపై దాడులు అమానుషం: కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్ ప్రజలపై క్రూరమైన దాడులను కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఖండించింది. ఏ రకమైన హింసా ఎన్నటికీ ఎటువంటి పరిష్కారాన్ని అందించదని, దాడులు ఆగిపోవాలని పేర్కొంది. గాజా స్ట్రిప్‌లోని అధికార హమాస్ ఉగ్రవాద సంస్థ, ఇజ్రాయిల్ మధ్య పూర్తి స్థాయి యుద్ధం జరిగింది. రెండు వైపుల నుంచి వందలాది మంది మరణించారు. ఇజ్రాయిల్ జాతీయ భద్రతా ఆందోళనలకు భరోసా ఇస్తూ చర్చల ద్వారా పాలస్తీనా ప్రజల న్యాయబద్ధమైన ఆకాంక్షలను నెరవేర్చాలని తమ పార్టీ ఎప్పుడూ విశ్వసిస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'ఇజ్రాయిల్ ప్రజలపై క్రూరమైన దాడులను భారత జాతీయ కాంగ్రెస్ ఖండిస్తుంది' అని ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. పలస్తీనా ప్రజల ఆత్మగౌరవం, సమానత్వం, గౌరవప్రదమైన జీవితానికి సంబంధించిన చట్టబద్ధమైన ఆకాంక్షలు ఇజ్రాయెల్ ప్రజల చట్టబద్ధమైన జాతీయ భద్రతా ప్రయోజనాలను నిర్ధారిస్తూ చర్చల ప్రక్రియ ద్వారా మాత్రమే నెరవేరాలని ఎల్లప్పుడూ విశ్వసిస్తారు' అని వెల్లడించారు.

బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశానికి ప్రమాదం: పినరయి విజయన్

కన్నూర్ : బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే దేశం అధిగమించలేని ప్రమాదంలో పడుతుందని, ఆ తర్వాత పశ్చాత్తాపం చెందే ప్రసక్తే ఉండదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆదివారం హెచ్చరించారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంతో పాటు ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్‌పై విమర్శల దాడి చేసిన విజయన్ దేశంలోని వైవిధ్యాన్ని నాశనం చేసి మతం ఆధారంగా దేశాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆవుల ఆధారంగా దేశంలో మత ఘర్షణలు జరుగుతున్నాయని, ఎలాంటి ఆహారం తీసుకోవాలో, ఒక వర్గం పౌరులను దేశ శత్రువులుగా చిత్రీకరిస్తున్నారని కేరళ సీఎం పేర్కొన్నారు. అతని/ఆమె కులం లేదా మతంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సమానమైన చట్టం రక్షణకు అర్హులని, అయితే దేశంలో అది మారుతుందని తెలిపారు. ఇదంతా మైనారిటీ వర్గాలను భయాందోళనలకు గురిచేస్తోందని ఉత్తర కేరళ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం అన్నారు. 'బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే, దేశం అధిగమించలేని ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది. ఆ తర్వాత విచారం వ్యక్తం చేయడంలో అర్థం ఉండదు. దేశం ఈ వాస్తవాన్ని గ్రహించింది. ఈ ప్రమాదాన్ని నివారించాలని ప్రజల అభిప్రాయం. అందుకే, బీజేపీని ఓడించి, మూడోసారి అధికారంలోకి రాకూడదనే లక్ష్యంతో లౌకిక వాద సంఘాలు, ప్రజలతో కూడిన ఏకీకృత కూటమి ఏర్పాటయింది' అని ముఖ్యమంత్రి విజయన్ అన్నారు. మూడో పర్యాయం కూడా సాధ్యం కాదనే విషయాన్ని బీజేపీ కూడా గుర్తించిందని తెలిపారు. ఆ అవగాహన వల్లనే ఇటీవలి కొన్ని సంఘటనలు సూచించినట్లుగా కొన్ని ప్రమాదకరమైన చర్యలు తీసుకునేలా చేసిందని అన్నారు. 'దేశంలోని నాలుగు ప్రతిపక్షాలు పాలిత రాష్ట్రాల్లో ఇటీవల వివిధ కేంద్ర దర్యాప్తు సంస్థలు జరిపిన దాడులు 'మారుతున్న పరిస్థితులకు బీజేపీ ఎలా స్పందిస్తుందో చూపిస్తుంది' అని చెప్పారు. 'వారి నుంచి ఇలాంటి మరిన్ని చర్యలు ఆశించవచ్చు. కానీ ప్రజల మనస్సును మార్చడానికి ఇది సరిపోదు. బీజేపీని ఓడించేందుకు ఏకీకృత కూటమి బలంగా ఉంది. మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది' అని ఆయన తెలిపారు.

లక్ష్యం దిశగా 'ఆదిత్య ఎల్1'

బెంగళూరు: సూర్యుడిపై పరిశోధనలకు ఉద్దేశించిన 'ఆదిత్య- ఎల్1 ఉపగ్రహం తన లక్ష్యం దిశగా ప్రయాణిస్తోంది. ఇప్పటికే భూ గురుత్వాకర్షణ పరిధిని దాటేసింది. ఈ క్రమంలోనే వ్యోమనౌక మార్గాన్ని సరిదిద్దే విన్యాసాన్ని జయప్రదంగా చేపట్టినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) వెల్లడించింది. లగ్రాంజ్ పాయింట్-1 దిశగా ప్రయాణిస్తున్న వ్యోమనౌకను దాని నిర్దేశిత మార్గంలో ఉంచేందుకు టీసీఎం దోహదపడుతుంది. ఈ నెల 6వ తేదీన 16 సెకన్లపాటు ఈ విన్యాసాన్ని నిర్వహించినట్లు ఇస్రో తెలిపింది. అంతకుముందు ఇస్రో శాస్త్రవేత్తలు... సెప్టెంబరు 19న ట్రాన్స్- లగ్రాంజియన్ పాయింట్ 1 ఇన్సర్షన్ విన్యాసాన్ని నిర్వహించి... ఆదిత్య ఉపగ్రహాన్ని 'ఎల్ 1' వద్దకు చేర్చే మార్గంలో ప్రవేశపెట్టారు. అనంతరం ఈ విన్యాసాన్ని ట్రాక్ చేయగా.. ట్రాజెక్టరీని సరిదిద్దాల్సిన అవసరం ఉందని గుర్తించారు. దీనికోసం తాజా విన్యాసం అవసరమైందని చెప్పారు. ఆదిత్య ఎల్-1లోని వ్యవస్థలన్నీ సజావుగా పనిచేస్తున్నాయని, లగ్రాంజ్ పాయింట్-1 దిశగా దూసుకెళ్తోందని తెలిపారు. మరికొన్ని రోజుల్లో మాగ్నెటోమీటర్ మళ్లీ ఆన్ చేస్తామన్నారు.

భారతీయ విద్యార్థులను సురక్షితంగా తీసుకొస్తాం కేంద్రమంత్రి మీనాక్షి లేఖి

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్‌లో కొనసాగుతున్న యుద్ధ పరిణామాలను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా గమనిస్తోందని కేంద్రమంత్రి మీనాక్షి లేఖి తెలిపారు. ఆ దేశంలో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులను స్వదేశానికి తీసుకొచ్చే ఏర్పాట్లను పరిశీలిస్తున్నామని చెప్పారు. 'ఇజ్రాయెల్‌లో చిక్కుకుపోయిన భారత విద్యార్థులను సురక్షితంగా తీసుకురావడానికి భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రధాన మంత్రి, ఆయన కార్యాలయ సిబ్బంది అక్కడి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆ దేశంలో చిక్కుకుపోయిన మన విద్యార్థులను తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని' ఏపీ పర్యటనలో ఉన్న ఆమె తెలిపారు.

గతంలోనూ ఏపీ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విదేశాల్లో చిక్కుకుపోయిన ఘటనలు చోటు చేసుకోగా... ఆపరేషన్ గంగ, వందేభారత్ తదితర ఆపరేషన్లు చేపట్టి ప్రతి ఒక్కరినీ సురక్షితంగా స్వదేశానికి చేర్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం భారత ప్రభుత్వం, ప్రధాన మంత్రి కార్యాలయం ఇజ్రాయిల్‌లో చిక్కుకున్న విద్యార్థులతో నేరుగా టచ్‌లో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని కచ్చితంగా తెలుసుకుంటోందన్నారు. ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో అక్కడి భారత రాయబార కార్యాలయం ఇదివరకే అడ్వైజరీ జారీ చేసింది. భారతీయ పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

జాతీయ ప్రభుత్వం దిశగా ఇజ్రాయిల్

- యుద్ధాన్ని జయించేందుకు ఏకమవుతున్న అధికార-విపక్షాలు
- విపక్ష నేతలతో నెతన్యాహు చర్చలు

టెల్ అవీవ్: పలస్తీనాతో యుద్ధం క్రమంలో జాతీయ ప్రభుత్వం దిశగా ఇజ్రాయిల్ అడుగులు వేస్తోంది. ఇందుకోసం ఇద్దరు ప్రతిపక్ష నేతలతో చర్చలు జరిపింది. బేషరతు మద్దతును కోరింది. ఇదే క్రమంలో ప్రతిపక్ష నాయకులు ఎయిర్ లాపిడ్, బెన్నీ గాంట్స్‌తో ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సుదీర్ఘ చర్చలు జరిపారు. గాజా నుంచి రాకెట్ల వర్షం కురవడంతో ఏర్పడిన అత్యవసర పరిస్థితి దృష్ట్యా అధికార-విపక్షాల జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై చర్చించారు. తమ మధ్య విభేదాలను, మనస్పర్థలను మరిచి ఐక్యంగా ముందుకెళ్లే సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. తమకు ఎదురైన జఠిల పరిస్థితిని పరిష్కరించుకోవడం కోసం అనుసరించాల్సిన వ్యూహాల క్రమంలో కలిసి ముందుకెళ్లాలని పాక్షిక అంగీకారం కుదిరింది. అయితే ప్రతిపక్ష నేతలు సానుకూలంగా ఉన్నప్పటికీ మంత్రులు బెజాలెల్ స్మోట్రిచ్, ఇతామర్ బెన్-గ్విర్‌ను తొలగిస్తేనే కలిసి వస్తామన్న షరతును లాపిడ్ పెట్టారు. భద్రతా అంశాలపై చర్చించేందుకు వచ్చినప్పుడు అత్యవసర ప్రభుత్వం ఏర్పాటు గురించి ప్రతిపాదించినట్లు నెతన్యాహు చెప్పుకోగా అది తాను చేసిన ప్రతిపాదన అని లాపిడ్ వెల్లడించారు. నెతన్యాహు ప్రతిపాదించినట్లు వచ్చిన వార్తలను కొట్టిపారేశారు. లాపిడ్ దేశ మాజీ ప్రధాని. నెతన్యాహుకు ముందు ఆ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మాట్లాడుతూ 'మనస్పర్థలు, విభేదాలన్నీ పక్కకు పెట్టి వృత్తిపరంగా అత్యవసర ప్రభుత్వం ఏర్పాటుకు సానుకూలత వ్యక్తంచేశాం. ఈ క్లిష్ట పరిస్థితుల నివారణకు ఉమ్మడి కార్యాచరణ అవసరమని సూచించాం' అని ఆయనన్నారు. యుద్ధాన్ని జయించడం తన అసమర్థ కేబినెట్ వల్ల కాదని నెతన్యాహుకు తెలుసని లాపిడ్ అన్నారు. బెన్నీ గాంట్స్ మాత్రం ఇలాంటి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతారనడంలో సందేహం లేదని వ్యాఖ్యానించారు. అత్యవసర జాతీయ ప్రభుత్వం ఏర్పడితే ఇజ్రాయిల్ రక్షణ దళాలకు దేశపౌరుల సంపూర్ణ మద్దతు ఉందన్న స్పష్టమైన సందేశం శత్రువులకు అందుతుందని లాపిడ్ నొక్కిచెప్పారు. మరోవైపు అత్యవసర ప్రభుత్వానికి బేషరతుగా మద్దతును గాంట్స్‌కు చెందిన నేషనల్ యూనిటీ తెలిపింది. భద్రతా పరమైన కీలక నిర్ణయాల అధికారాన్ని కోరింది. పార్టీ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ 'సముచిత అధికారం ఉంటే బెన్-గ్విర్‌ను పావుగా వాడుకుంటాం. ప్రభుత్వాన్ని విచ్ఛిన్నం చేయబోం. అది హమాస్‌కు కానుకగా పరిణమిస్తుంది. ఈ యుద్ధంలో గెలిచేందుకు ఏమైనా చేస్తాం. ఆ తర్వాత ప్రభుత్వాన్ని వదలివేస్తాం' అని ఆయనన్నారు.

భారతీయులంతా క్షేమం

ఇజ్రాయిల్, గాజాలోని దౌత్యకార్యాలయాల ప్రకటన

జెరూసలేం: ఇజ్రాయిల్, గాజా మధ్య భీకర పోరు కొనసాగుతున్న క్రమంలో ఆయా ప్రాంతాల్లోని భారతీయులంతా క్షేమంగా ఉన్నట్లు టెల్ అవీవ్‌లోని భారతీయ దౌత్యకార్యాలయం వెల్లడించింది. తమను క్షేమంగా స్వదేశానికి చేర్చాలని కొందరు పౌరులు, పర్యాటకుల నుంచి ఫిర్యాదులు అందినట్లు కూడా తెలిపింది. ఇజ్రాయిల్‌లో మొత్తం 18వేల మంది భారతీయులు ఉండగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న దాఖలాలు లేవని అధికారిక వర్గాలు వెల్లడించాయి. చాలా వరకు పర్యాటకులంతా గుంపుల్లో ప్రయాణిస్తుండగా, కొందరు వ్యాపారవేత్తలు చిక్కుకుపోయారు. అయితే ఎవరికీ ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని దౌత్యకార్యలయ వర్గాలు తెలిపాయి. భారతీయులంతా అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా నేరుగా తమను సంప్రదించాలంటూ శనివారం పలస్తీనాలో రిప్రెజంటేటివ్ ఆఫీస్, టెల్ అవీవ్‌లోని భారతీయ దౌత్యకార్యాలయం సూచనలు చేశాయి. భారతీయులకు 24 గంటల సేవలు అందించేందుకు అందుబాటులో ఉంటామని వెల్లడించాయి. కాగా ఇజ్రాయిల్‌లో ఉన్న భారతీయుల్లో చాలా మంది ఆరోగ్య సంరక్షణ విధుల్లో ఉండగా, వేలాది మంది విద్యార్థులు, టెక్కీలు, వజ్ర వ్యాపారులు ఉన్నారు.

నిఘా వ్యవస్థ వైఫల్యం

టెల్అవీవ్: ఇజ్రాయిల్-పలస్తీనా మధ్య అనేక దశాబ్దాలుగా ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇజ్రాయిల్‌పై హమాస్ తీవ్రవాదులు బాంబుల వర్షం కురిపించారు. నిమిషాల వ్యవధిలో వేల రాకెట్లు ప్రయోగించారు. వాస్తవానికి ఇజ్రాయిల్ నిఘా వ్యవస్థ పటిష్ఠంగా ఉంటుంది. కానీ హమాస్ దాడిని పసిగట్టడంలో విఫలమైంది. దీంతో నిఘా వ్యవస్థ విఫలమైనట్లు విమర్శలు వచ్చాయి. ఇది కచ్చితంగా ఇంటెలిజెన్స్ వైఫల్యమే. లేకపోతే ఇలా దాడులు జరిగేందుకు వీల్లేదు అని మధ్యప్రాచ్యానికి అమెరికా ప్రభుత్వ మాజీ సహాయక జాతీయ ఇంటెలిజెన్స్ అధికారి జానథన్ పానికాఫ్ అన్నారు. అత్యంత అధునాతన నిఘా సాఫ్ట్‌వేర్ పెగాసెస్ కలిగివున్నప్పటికీ ఇలాంటి పరిస్థితి రావడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇజ్రాయిల్ బలాలు, బలహీనతలు హమాస్‌కు బాగా తెలుసు. గతంలో సొరంగాలు తవ్విమరీ వారక్కడ దాడులు చేశారు. ఇరాన్‌కు చెక్ చెప్పడం, ఇస్లామిక్ రిపబ్లిక్ అణు కార్యక్రమాలను తిప్పికొట్టడం వంటివాటిపై దృష్టిపెట్టిన ఇజ్రాయిల్ సొంతగడ్డకు పొంచివున్న ప్రమాదాన్ని గ్రహించలేకపోయింది. హమాస్ దాడులు ఆకస్మికంగా జరిగినవి కాదని, చాలా కాలంగా ప్రణాళికలు రూపొందాయని ఇజ్రాయిల్ మాజీ జాతీయ భద్రతా సలహాదారు ఇయల్ హులాటా అన్నారు. 'ఇది పక్క ప్రణాళికాబద్ధంగా జరిగిన దాడి. వారు (హమాస్) మమ్మల్ని షాక్‌కు గురిచేయడంలో సఫలమయ్యారు. చాలా నష్టం కలిగించారు' అని ఆయనన్నారు.

గాజాకు నిత్యావసరాలు కట్!

జెరూసలేం: తమ దేశంపై దాడులు చేసినందుకు గాజాపై ప్రతీకారానికి ఇజ్రాయిల్ చర్యలు తీసుకుంటోంది. ఓవైపు ప్రతిదాడులు కొనసాగిస్తూనే మరోవైపు నిత్యావసరాల సరఫరా నిలిపివేస్తోంది. విద్యుత్, ఇంధనం, నిత్యావసరాలను సరఫరా చేయబోమని ప్రధాని నెతన్యాహు ప్రకటన క్రమంలో శనివారం రాత్రి గాజా అంధకారంలో చిక్కుకుంది. అనేక ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను ఇజ్రాయిల్ నిలిపివేసింది. దాడి చేసే విషయంలో ఏ మాత్రం వెనుకాడేది లేదని, కనికరం చూపబోమని నెతన్యాహు హెచ్చరించారు.

అమెరికా నిధులతోనే...

ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి మీద ట్రంప్

వాషింగ్టన్: ఇజ్రాయిల్‌పై హమాస్ దాడులకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కారణమని ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా నిధులతోనే ఈ దాడులు జరిగాయని ఆరోపించారు. అమెరికా ప్రజలు చెల్లించిన పన్నులతోనే ఈ దాడులకు నిధులు సమకూరి నట్లు వెల్లడించారు. 'ఇజ్రాయిల్‌పై హమాస్ దాడులు బాధాకరం. బలమైన శక్తితో దాడులను తిప్పికొట్టే హక్కు ఇజ్రాయిల్‌కు ఉంది. అమెరికా ప్రజలు చెల్లించిన పన్నులతో ఈ దాడులకు నిధులు అందడం అవమానకరం. బైడెన్ ప్రభుత్వ నివేదికల్లో కొన్నింటి ద్వారా ఈ మేరకు స్పష్టత లభిస్తోంది' అని ట్రంప్ అన్నారు. ఇరాన్‌కు అమెరికా గతనెలలో ఆరు బిలియన్ దాలర్ల ఆర్థిక సాయం అందించగా, వాటితో ఆయుధాలను హమాస్‌కు ఇరాన్ సరఫరా చేసిందని రిపబ్లికన్ పార్టీ ఆరోపించింది.

ఇది బాధాకరం: ఆండ్రూ బేట్స్

తమ వల్లే హమాస్ దాడులు చేయగలిగినట్లు రిపబ్లికన్లు చేస్తున్న ఆరోపణలను శ్వేతసౌధం సహాయక ప్రెస్ కార్యదర్శి ఆండ్రూ బేట్స్ ఖండించారు. డెమొక్రాట్ ప్రభుత్వంపై ఆరోపణలు బాధాకరమన్నారు. అమెరికా ఇచ్చిన నిధులు ఆహారం, ఔషధాలు వంటి అవసరాల కోసం మాత్రమే ఉపయోగిస్తారని తెలిపారు.

యుద్ధం అంటే ఓటమి: పోప్ ఫ్రాన్సిస్

వాటికన్: యుద్ధం అంటే ఓటమి... కేవలం ఓటమి అని పోప్ ఫ్రాన్సిస్ అన్నారు. యుద్ధాన్ని ఆపేయాలని పిలుపునిచ్చారు. యుద్ధం జరిగితే అమాయకులు ప్రాణాలు కోల్పోతారు తప్ప జరిగే మంచి ఏమీ ఉండదన్నారు. ఉగ్రవాదం వల్లగానీ యుద్ధాల వల్లగానీ ఏ సమస్యకు పరిష్కారం లభించబోదని నొక్కిచెప్పారు. ఇజ్రాయిల్, పలస్తీనాలో శాంతి కోసం ప్రార్థిద్దామని సెయింట్ పీట్స్ స్క్వేర్‌లో సందేశమిచ్చిన సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ అన్నారు.

పలస్తీనాకు విమోచనంతోనే పరిష్కారం: చైనా

బీజింగ్: పలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య యుద్ధ పరిస్థితులపై చైనా దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. స్వతంత్ర పలస్తీనా ఏర్పాటుతోనే ఈ సమస్యకు పరిష్కారం సాధ్యమని చైనా విదేశీ వ్యవహారాల శాఖ సూచించింది. తరచూ ఘర్షణలు జరుగుతుండటం, పరిస్థితులు ఎప్పటికప్పుడు జఠిలంగా మారుతుండటం, శాంతి ప్రక్రియలో ప్రతిష్ఠంభన కొనసాగుతుండటం ఆందోళనకరమని పేర్కొంది. 'టూ స్టేట్' పరిష్కారాన్ని అమలు చేయడమే శ్రేయస్కరమని నొక్కిచెప్పింది. పలస్తీనా విమోచనంతోనే సమస్య పరిష్కారమవుతుందని అభిప్రాయపడింది. శాంతి స్థాపన కోసం అంతర్జాతీయ సమాజంతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధమని ఆదేశ విదేశాంగ శాఖ తెలిపింది. తాజా పరిణామాల దృష్ట్యా వెంటనే స్పందించి పలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య శాంతి చర్చలను సాధ్యమైంత త్వరగా ప్రారంభమయ్యేందుకు దోహదం కావాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చింది.

మళ్లీ వెలుగులోకి హమాస్

టెల్ అవీవ్: పలస్తీనాలోని హమాస్ బృందం ఇజ్రాయిల్ మీద శనివారం మూకుమ్మడిగా 5,000 రాకెట్లు ప్రయోగించడం, దానితో పలస్తీనియన్లపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఇజ్రాయిల్ ప్రతి దాడులు చేయడం వల్ల హమాస్ మళ్లీ వార్తల్లోకి ఎక్కింది. పలస్తీనాకు పొరుగున ఉన్న అనేక ఇజ్రాయిలీ పట్టణాలపై ఈ దాడులు జరిగాయి. ఇజ్రాయిల్ కు అత్యంత పటిష్టమైన రక్షణ వ్యవస్థ ఉన్నందువల్ల హమాస్ మెరుపు దాడి చేసింది. ఇజ్రాయిల్ రక్షణ వ్యవస్థను ఐరన్ డోం అంటారు. పలస్తీనా హక్కులకోసం పోరాడుతున్న హమాస్ (హర్కత్ అల్-ముకవమా అల్-ఇస్లామియా) సంస్థను అహమద్ యాసీన్, అబ్దుల్ అజీజ్ అల్-రంతిస్సీ 1987లో ఏర్పాటు చేశారు. ఇది నిజానికి ఈజిప్టుకు చెందిన ముస్లిం బ్రదర్హుడ్‌కు అనుబంధ సంస్థే. హమాస్ అంటే ఇస్లామిక్ ప్రతిఘటనోద్యమం. పలస్తీనాను విముక్తం చేసి ఇజ్రాయిల్, గాజా పశ్చిమ తీరం, గాజా నది సరసన ఇస్లామిక్ రాజ్యం ఏర్పాటు చేయడం హమాస్ అంతిమ లక్ష్యం అని 1988లో ప్రకటించారు. అయితే ఆ తరవాత ఇజ్రాయిల్ కనక 1967కు ముందున్న సరిహద్దులకు పరిమితమైతే ఇజ్రాయిల్‌తో సంధి చేసుకోవడానికి సిద్ధమేనని హమాస్ ప్రకటించింది. ముస్లిం బ్రదర్హుడ్ తో సంబంధాలు తెగతెంపులు చేసుకోవడానికి కూడా సిద్ధపడింది. అయితే ఇదంతా బూటకం అన్నది ఇజ్రాయిల్ వాదన.

హమాస్‌కు దావా అనే సాంస్కృతిక సంస్థతో పాటు ఇజ్ అద్-దీన్ అల్-ఖస్సం బ్రిగేడ్ అనే సాయుధ దళం కూడా ఉన్నాయి. హమాస్‌కు ఇరాన్, సిరియా, లెబనాన్‌లోని ఇస్లామిక్ బృందం హెజ్బుల్లాతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇవన్నీ కలిసి ఒక కూటమిగా వ్యవహరిస్తాయి. ఈ కూటమి ఆ ప్రాంతంలో అమెరికా అనుసరిస్తున్న విధానాలను గట్టిగా వ్యతిరేకిస్తుంది. తమ భూ భాగాన్ని ఆక్రమించిన వారిని ఎదుర్కొనే ధైర్య సాహసాలు పలస్తీనియన్లకు ఉన్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తాజాగా వ్యాఖ్యానించింది. పలస్తీనా భూభాగంలో, పశ్చిమాసియాలోని ఇతర దేశాల మద్దతు హమాస్‌కు ఉంది. శనివారం జరిగిన రాకెట్ దాడులు గర్వ కారణమైనవని, వీరోచితమైనవని యెమెన్ అభిప్రాయపడింది. ఇలాంటి పరిస్థితి ఏర్పడడానికి పూర్తి బాధ్యత ఇజ్రాయిల్ దేనని ఖతర్ వ్యాఖ్యానించింది. అరబ్ లీగ్, జోర్డాన్ సైతం ఇజ్రాయిల్ విధానాలను ఎండగడుతున్నాయి. సంయమనం పాటించాలని ఈజిప్ట్, మొరాకో, సౌదీ అరేబియా కోరుతున్నాయి.

పలస్తీనియన్ల అస్తిత్వం కోసం పోరాడుతున్న హమాస్‌ను ఇజ్రాయిల్, అమెరికా, యూరప్ సమాజం, కెనడా, ఈజిప్ట్, జపాన్ నిషేధించాయి. ఇవన్నీ అమెరికా పంచన చేరిన దేశాలే. హమాస్ కార్యకలాపాలను ఖండించేందుకు 2018లో ఐక్య రాజ్యసమితి సార్వత్రిక సభలో అమెరికా ప్రతిపాదించిన తీర్మానం వీగిపోయింది. యాసిర్ అరఫాత్ నాయకత్వంలో పలస్తీనియన్ల హక్కుల కోసం పోరాడిన ఫతాతో ఘర్షణకు దిగడంతో హమాస్ రాజకీయ రంగంలోకి ప్రవేశించింది. ఫతా కూడా కొంతకాలం సాయుధ పోరాటం కొనసాగించినా తరవాత ఆ మార్గాన్ని విడనాడింది. 1967నాటి సరిహద్దులకు అనుగుణంగా పలస్తీనా రాజ్యం ఏర్పడాలన్న ఐక్య రాజ్య సమితి తీర్మానాన్ని సమర్థించింది. అంటే ఇజ్రాయిల్ పొరుగున పలస్తీనా కూడా ఉంటుంది. 2004లో అరఫాత్ మరణించడంతో హమాస్ బాగా బలపడింది. ఫతాతో అంతర్యుద్ధం పర్యవసానంగా హమాస్ గాజా ప్రాంతంపై పట్టు సంపాదించింది. ఫతాక్‌కు గాజా పశ్చిమ తీరంలో బలం ఉంది. తమది ఇస్లామిక సంస్థ అని హమాస్ చెప్పుకుంటోంది. అరఫాత్ నాయకత్వంలోని ఫతా సెక్యులర్ విధానాలు అనుసరిస్తుంది. హమాస్ అసలు ఇజ్రాయిల్ అస్తిత్వాన్నే గుర్తించదు. హమాస్ సాయుధ ఘర్షణను సమర్థిస్తే ఫతా సంప్రదింపులకు ప్రాధాన్యం ఇస్తుంది. పలస్తీనా భూభాగంకోసం హామస్, ఫతా మధ్య నిరంతరం ఘర్షణలు జరుగుతూనే ఉంటాయి. ఈ ఘర్షణను నివారించడానికి చేసిన అనేక ప్రయత్నాలు విఫలమైనాయి. 2021-22లో జరిగిన స్థానిక ఎన్నికలను హమాస్ బహిష్కరించింది. పలస్తీనాకు అధ్యక్షుడిగా ఉన్న మహమూద్ అబ్బాస్ ప్రస్తుతం ఫతాహ్‌కు అధిపతిగా ఉన్నారు. సాయుధ ఘర్షణలవల్ల పలస్తీనా ప్రజల స్వయం నిర్ణయాధికారానికి విఘాతం కలుగుతుందన్నది, రాజకీయ పరిష్కారానికి అవకాశాలు సన్నగిల్లుతాయని ఫతా అభిప్రాయం.

తడబడ్డా...నిలబడ్డారు

- ఆదుకున్న కోహ్లీ, రాహుల్
- తొలి మ్యాచ్‌లో ఆసీస్‌పై టీమిండియా జయభేరి

చెన్నై: వన్డే ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇక్కడి చెపాక్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఆరు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తద్వారా ప్రపంచకప్‌ను విజయంతో ఆరంభించింది. అయితే 200 పరుగుల స్వల్ప విజయ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియాకు ఆదిలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. 5 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్లు రోహిత్, ఇషాన్ కిషన్‌తోపాటు శ్రేయాస్ అయ్యర్ ఖాతా తెరవకుండానే పెవెలియన్ చేరారు. ఈ దశలో విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ ఆచి తూచి ఆడుతూ...లక్ష్యాన్ని కరిగించారు. కాగా మరోసారి విరాట్ కోహ్లీ ని ఔట్ చేయడం ద్వారా హేజిల్‌వుడ్ టీమిండియాను దెబ్బతీశాడు. కోహ్లీ (116 బంతుల్లో 85 పరుగులు) లబుషేన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికి స్కోరు 167/4. ఈ దశలో హార్దిక్ పాండ్యా (8 బంతుల్లో 11 పరుగులు)తో కలిసి కేఎల్ రాహుల్ (97) మరో ఎనిమిది ఓవర్లు మిగిలి ఉండగానే జట్టును విజయ తీరాలకు చేర్చాడు. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 199 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్‌లలో డేవిడ్ వార్నర్ (41), స్టీవెన్ స్మిత్ (46) మాత్రమే పరవాలేదనిపించారు. టీమిండియా బౌలర్‌లు రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్ ఆసీస్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టారు. ఆసీస్.. మ్యాచ్ ప్రారంభం నుంచే పరుగులు రాబట్టడానికి తంటాలు పడింది. వార్నర్, స్టీవెన్ స్మిత్ కొంతసేపు నిలకడగా ఆడటంతో స్కోర్ బోర్డు మెల్లగా ముందుకు సాగింది. ఆ ఇద్దరూ ఔటైన తర్వాత జట్టు పరిస్థితి దయనీయంగా మారింది. చివర్లో మిచెల్ స్టార్క్ (28) రాణించడంతో ఆసీస్ ఆ మాత్రం గౌరవప్రదమైన స్కోర్‌నైనా చేయగలిగింది. మూడో ఓవర్‌లో జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో ఆసీస్ ఓపెనర్ మిచెల్ మార్ష్ విరాట్ కోహ్లీకి క్యాచ్ ఇచ్చి డకౌట్ అయ్యాడు. ఆ తర్వాత వార్నర్, స్టీవెన్ స్మిత్ నిలకడగా ఆడారు. కానీ 17వ ఓవర్లో వార్నర్ ఔట్‌తో వికెట్ల పతనం మొద లైంది. 28వ ఓవర్లో స్టీవెన్ స్మిత్ ఔట్‌తో పరిస్థితి మరింత దిగజారింది. లబుషేన్ (27), గ్లెన్ మాక్స్‌వెల్ (15), పాట్ కమ్మిన్స్ (15) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. మిగతా బ్యాటర్లలో అలెక్స్ క్యారీ, కామెరూన్ గ్రీన్ ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. భారత బౌలర్‌లలో రవీంద్ర జడేజా మూడు వికెట్లు, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్ రెండేసి వికెట్లు చొప్పున తీశారు. రవిచంద్రన్ అశ్విన్, హార్దిక్ పాండ్యా, మహ్మద్ సిరాజ్ తలా ఓ వికెట్ పడగొట్టారు. భారత బౌలింగ్ ధాటికి అద్భుతమైన ఫీల్డింగ్ కూడా తోడు కావడంతో ఆసీస్ తక్కువ స్కోర్‌కు ఆలౌట్ అయ్యింది.

సంస్మరణ

ఉన్నతమైన భావాలు, ఉన్నతమైన ఆశయాలు,
కుటుంబ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన
కామ్రేడ్ వెలువోలు భానుమతి గారు
లేని లోటు తీరనిది. భౌతికంగా మా మధ్య లేకపోయిన
మా అందరి హృదయాలలో ఎల్లప్పుడు ఉంటారు.
శోకతప్త హృదయాలతో...
కామ్రేడ్ వెలువోలు భానుమతి గారు
జననం : 20-09-1953 మరణం : 29-09-2023
భర్త
వెలువోలు సాంబశివరావు
కుమార్తె - అల్లుడు : కంచర్ల మాధవి స్వెత్లాన - గౌరిశంకర్
మనుమడు : విక్రమ్, మనుమరాలు: సింధు
ముదిమనుమడు : జోహిత్, ముదిమనుమరాలు : తన్వీ
మనుమరాలు : పొన్నగంటి విజేత, మనుమడు : పొన్నగంటి వెంకటకృష్ణ
ముదిమనుమరాలు : పొన్నగంటి నిహిత, ముది మనుమడు : పొన్నగంటి హేమచంద్ర
కుమారుడు - కోడలు : వెలువోలు రమేష్ చంద్ర - సౌజన్య
మనుమరాలు : అక్షర, మనుమడు : ఆదిత్యరామ్
సంస్మరణ కార్యక్రమం : ది. 09-10-2023 సోమవారం, మంగళగిరి మండలం, నూతక్కి గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.